

డిబ్రుగర్-కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ ఫ్రీక్వెన్సీ పెంపు

విశాఖపట్నం, మార్చి 18: ప్రయాణికుల సౌకర్యార్థం విశాఖ మీదుగా డిబ్రుగర్, కన్యాకుమారి మధ్య నడుస్తున్న వివేక్ ఎక్స్‌ప్రెస్ సర్వీసుల (22504/22503) ఫ్రీక్వెన్సీ పెంచుతున్నట్టు సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. ప్రస్తుతం వారానికి నాలుగు రోజులు నడుస్తున్న ఈ సర్వీసులను ఈనెల 22వతేదీ నుంచి వారానికి ఐదు రోజులపాటు అం దుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.దీంతో 22504 నంబరు గల డిబ్రుగర్-కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ ఈనెల 22వ తేదీ నుంచి ప్రతి మంగళ, గురు, శుక్ర, శని, ఆదివారం.... తిరుగు ప్రయాణంలో 22506 నంబరు గల కన్యాకుమారి-డిబ్రుగర్ ఎక్స్‌ప్రెస్ ఈనెల 26వ తేదీ నుంచి ప్రతి సోమ, మంగళ, బుధ, గురు, శనివారం అందుబాటులో ఉంటాయని తెలిపారు.

వైసీపీపై యాదవుల గుస్సా

జిల్లాలో ఒక్క సీటు కూడా కేటాయించకపోవడంపై సామాజిక వర్గంలో అసంతృప్తి



- పార్టీలో ఉన్న తమ వర్గ నేతలపై ఒత్తిడి
- ఉత్తరాంధ్ర సమన్వయకర్త దృష్టికి తీసుకువెళ్లిన నేతలు
- ఏదో ఒకసీటు కేటాయించకపోతే పార్టీకి నష్టమేనని స్పష్టీకరణ
- సీఎం దృష్టికి తీసుకువెళతానన్న సుబ్బారెడ్డి

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీపై యాదవ సామాజిక వర్గంలో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. తమకు జిల్లాలో కనీసం ఒక్క స్థానం కూడా కేటాయించకపోవడం పట్ల మండిపడుతోంది. గడచిన రెండు ఎన్నికల్లో వైసీపీ తూర్పు నియోజకవర్గాన్ని యాదవులకు కేటాయించింది. ఈసారి జిల్లాలో ఒక్క సీటు కూడా ఇవ్వలేదు. ఏదో ఒక స్థానాన్ని యాదవులకు కేటాయించేలా అధిష్ఠానంతో మాట్లాడాలంటూ పార్టీలో గల ఆ సామాజిక వర్గ నేతలపై ఒత్తిడి పెరుగుతోంది. దీంతో సంబంధిత వర్గం నేతలు పార్టీ ముఖ్య నేతలను కలిసి తమకు ఏదో ఒకసీటు కేటాయించాలని, లేనిపక్షంలో ఎన్నికల్లో ప్రతికూలంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించినట్టు తెలిసింది.

జిల్లాలో ఏడు అసెంబ్లీ (ఆరు పూర్తిగా, ఒకటి పాక్షికం) నియోజకవర్గాలు ఉన్నాయి. వైసీపీ ఆవిర్భావం నుంచి తూర్పు నియోజక వర్గాన్ని యాదవ సామాజిక వర్గానికి కేటాయిస్తూ వచ్చింది. టీడీపీ గాజువాక నియోజకవర్గాన్ని యాదవ సామాజిక వర్గానికి కేటాయిస్తోంది. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా పోటీ చేస్తున్నాయి. ఇందులో భాగంగా టీడీపీ నాలుగు, జనసేన రెండు, బీజేపీ ఒక స్థానం నుంచి పోటీ చేయబోతున్నాయి. టీడీపీ తాను పోటీ చేయబోయే నాలుగింటిలో ఒక స్థానాన్ని (గాజువాక)ను యాదవ సామాజిక వర్గానికి చెందిన పల్లా శ్రీనివాసరావుకు కేటాయించింది. జనసేన కూడా తమకు దక్కిన రెండు స్థానాల్లో ఒకటైన దక్షిణం నియోజకవర్గం టికెట్‌ను యాదవ సామాజిక వర్గానికి చెందిన వంశీకృష్ణ శ్రీనివాస్‌కు కేటాయించింది. కానీ ఏడు అసెంబ్లీ స్థానాల నుంచి పార్టీ అభ్యర్థులనే పోటీకి దింపుతున్న వైసీపీ మాత్రం ఒక్క స్థానం కూడా యాదవులకు ఇవ్వలేదు. తూర్పు నియోజకవర్గాన్ని ఈసారి ఎంపీ ఎంవీవీ సత్యనారాయణకు కేటాయించాలని ముందే నిర్ణయానికి వచ్చిన అధిష్ఠానం గాజువాక నుంచి యాదవ సామాజిక వర్గానికి చెందిన 70వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి రామచంద్రరావును పోటీకి దింపాలని నిర్ణయించి, ఆ మేరకు రెండు నెలల కిందట సమన్వయకర్తగా ప్రకటించింది. కానీ అక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అభ్యంతరం తెలపడంతో చందూను తొలగించి మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను నియమించడం, ఆ వెంటనే టికెట్‌ను ఖరారు చేయడం జరిగిపోయింది. దీంతో యాదవ సామాజికవర్గానికి ఒక్క సీటు కూడా ఇవ్వనట్టయ్యింది. దీనిపై యాదవ సామాజిక వర్గంలో తీవ్రస్థాయిలో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇటీవల శివాజీ పాలెంలోని ఒక ఫంక్షన్ హాల్‌లో యాదవ సామాజిక వర్గం సమావేశం జరిగింది. యాదవులకు ప్రాతినిధ్యం లేకుండా వైసీపీ చేసిందని, ఏదో ఒక సీటు కేటాయించేలా పార్టీపై ఒత్తిడి తేవాల్సిన బాధ్యత ఆ పార్టీలో ఉన్న నేతల పైనే ఉందని స్పష్టంచేశారు. సీటు కేటాయించని పక్షంలో యాదవ సామాజికవర్గం వైసీపీ అభ్యర్థులకు సహకరించేది లేదని కూడా కొంతమంది హెచ్చరించినట్టు సమాచారం. సామాజిక వర్గాన్ని అడ్డంపెట్టుకుని కార్పొరేటర్, నియోజకవర్గ స్థాయిలో పార్టీ పదవులు దక్కించుకుని సరిపెట్టుకోవడం కాదని, ... మిగతా 6వ పేజీలో

చీపురుపల్లికి గంటా



- 'భీమిలి'పై ఇంకా రాని స్పష్టత
- టికెట్ కోసం తీవ్ర పోటీ
- రేస్‌లో కర్రోతు బంగార్రాజు, బైరా ఫౌండేషన్ ఎండీ...

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం జిల్లాలో తెలుగుదేశం పార్టీ ఒకే ఒక్క అసెంబ్లీ నియోజకవర్గానికి ఇంకా అభ్యర్థిని ప్రకటించలేదు. అదే భీమునిపట్నం. సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు అక్కడి నుంచి పోటీ చేయాలని భావించారు. పార్టీ అధిష్ఠానం మాత్రం ఆయన్ను విజయనగరం జిల్లా చీపురుపల్లి నుంచి పోటీ చేయాలని ఆదేశించింది. అక్కడ అధికార పార్టీ వైసీపీ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే, సీనియర్ మంత్రి బొత్స సత్యనారాయణ బరిలో ఉన్నారు. ఆయనపై గంటాను పోటీకి నిలపాలని చంద్రబాబునాయుడు నిర్ణయించారు. అయితే చీపురుపల్లి దూరం అవుతుందని, భీమిలిలో పోటీ చేస్తానని గంటా తన మనసులో మాట వెల్లడించారు. తాము పక్కాగా సర్వే చేయించామని, మంచి మెజారిటీతో గెలుపు ఖాయమని చంద్రబాబునాయుడు స్పష్టంచేయడంతో చీపురుపల్లి నుంచి పోటీకి గంటా శ్రీనివాసరావు సిద్ధమైనట్టు తెలిసింది. విజయంతో తిరిగి వస్తానని చెప్పినట్టు సమాచారం. దీంతో చీపురుపల్లి టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావేనని స్పష్టత వచ్చేసింది. అయితే ఇక్కడ భీమిలి నుంచి టీడీపీ తరపున ఎవరు పోటీ చేస్తారనే అంశంపై ఇంకా చర్చలు జరుగుతున్నాయి. విజయనగరం జిల్లా నెల్లిమర్ల నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని కర్రోతు బంగార్రాజు ఏర్పాట్లు చేసుకోగా పొత్తుల్లో భాగంగా ఆ స్థానాన్ని జనసేనకు కేటాయించగా, అక్కడి నుంచి లోకం మాధవిని పోటీకి దించింది. దాంతో బంగార్రాజు భీమిలి సీటు అడుగుతున్నారు. భీమిలి టీడీపీ ఇన్‌చార్జిగా కోరాడ రాజబాబు ఉన్నారు. టికెట్ కోసం ఆయన శతవిధాలా యత్నిస్తున్నారు. మరోవైపు అనకాపల్లి ఎంపీ సీటు కోసం యత్నించిన బైరా ఫౌండేషన్ ఎండీ దిలీప్ చక్రవర్తి...ఆ సీటు బీజేపీకి ఇచ్చేశారని తెలిసి, తాను భీమిలి వెళతానని అవకాశం ఇవ్వాలని కోరుతున్నట్టు సమాచారం. భీమిలి సీటు ఒక్కటే ఖాళీగా ఉండడంతో దాని కోసం చాలామంది చాలా రకాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. అధిష్ఠానం ఎవరికి అవకాశం ఇస్తుందో చూడాలి.

దక్కని దీవెన



విద్యార్థులపై ఫీజు భారం

- జగనన్న విద్యా దీవెన పథకం కింద ఏడాదికి నాలుగు విడతలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ చేస్తామని జగన్ ప్రభుత్వం ప్రకటన
- ఈ ఏడాది ఒక దఫా మాత్రమే విడుదల
- అది కూడా కొంతమందికి ఇప్పటికీ జమ కాని వైనం
- మూడు విడతలు పెండింగ్
- అవి కడితేనే పరీక్షలకు అనుమతిస్తామంటున్న కళాశాలల యాజమాన్యాలు
- వేలాది మంది విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళన
- పట్టించుకోని అధికారులు

విశాఖపట్నం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి):

వైసీపీ ప్రభుత్వం 'జగనన్న విద్యాదీవెన' పథకం నిధులను సకాలంలో విడుదల చేయకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఏటా నాలుగు విడతల్లో ఫీజు మొత్తం ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. అయితే 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి తొలి విడత ఫీజును ఈ నెల ఒకటో తేదీన విద్యార్థి, తల్లి జాయింట్ ఖాతాకు జమ చేసింది. ఇంకా మూడు విడతలు పెండింగ్ ఉంది. ఇటుచూస్తే విద్యా సంవత్సరం చివరికి వచ్చేసింది. మరోవైపు ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. ఈ నేపథ్యంలో ఇప్పట్లో ప్రభుత్వం ఫీజులను చెల్లించే అవకాశం లేదని భావిస్తున్న కళాశాలల యాజమాన్యాలు... బకాయిలు (మూడు విడతల ఫీజు) చెల్లించాల్సిందిగా విద్యార్థులపై ఒత్తిడి తీసుకువస్తున్నాయి.

ఎన్నికల తరువాత ఏ ప్రభుత్వం వస్తుందో, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై విధానపరంగా ఎటువంటి తీసుకుంటుందోననే ఉద్దేశంతోనే కళాశాలల యాజమాన్యాలు... ప్రస్తుతం విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్నాయి. గడిచిన నెల రోజులు నుంచి ఇంజనీరింగ్ విద్యార్థులు ఈ తరహా ఇబ్బందులను ఎదుర్కొంటుండగా, ప్రస్తుతం డిగ్రీ, పాలిటెక్నిక్ వంటి కోర్సులు చదివే విద్యార్థులకు కూడా కాలేజీల నుంచి ఫీజుల విషయంలో ఒత్తిడి మొదలైంది.

విశాఖపట్నం జిల్లాలో సుమారు 44 వేల మంది విద్యార్థులు ఇంజనీరింగ్, డిగ్రీ, పాలిటెక్నిక్, ఐటీఐ వంటి కోర్సులు చదువుతున్నారు. అనకాపల్లి జిల్లాలో 39,773 మంది వివిధ కోర్సులు చదువుతుండగా, వీరిలో సుమారు పది వేల మంది ఫైనలియర్ చదువుతున్నారు. అలాగే, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 12,457 మంది వివిధ కోర్సులు చదువుతున్నారు. వీరందరికీ ఈ విద్యా సంవత్సరానికి సంబంధించిన ఇంకా మూడు విడతల ఫీజును ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. విశాఖ నగర పరిధిలోని ఓ ప్రముఖ కాలేజీలో ఏడాదికి ఫీజు రూ.67,700. ప్రభుత్వం నాలుగు విడతల్లో ఈ మొత్తాన్ని చెల్లించాలి. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి తొలి విడత మొత్తాన్ని సీఎం ... మిగతా 6వ పేజీలో

ఎన్నికల కోడ్ అమలుకు ప్రత్యేక విభాగాలు

- ఫిర్యాదుల పరిష్కారానికి కంట్రోల్‌రూమ్, అనుమతుల జారీకి సింగిల్‌విండో సెల్ ఏర్పాటు
- ప్రవర్తనా నియమావళి అమలుకు జీవీఎంసీ కమిషనర్ సారథ్యంలో ఒక కమిటీ



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

విశాఖపట్నం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి):

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై అధికారులు గట్టిగా దృష్టిపెట్టారు. అన్ని అంశాలపై ఎప్పటికప్పుడు తమకు నివేదికలు ఇవ్వాలన్న ఎన్నికల సంఘం ఆదేశాలను పాటిస్తున్నారు. ఎన్నికల కోడ్ అమలు, నామినేషన్ల స్వీకరణ, వ్యయ నియంత్రణ, ప్రచారం, సభలు, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం వంటి అంశాల పరిశీలనకు ప్రత్యేకంగా విభాగాలు ఏర్పాటు చేశారు. ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదుల స్వీకరణకు కంట్రోల్‌రూమ్ ఏర్పాటుచేసి రెండు షిఫ్టుల్లో పనిచేసేలా సిబ్బందిని నియమించారు. ఈ కంట్రోల్‌రూమ్ 24 గంటలూ పనిచేస్తుంది. ర్యాలీలు, సభల నిర్వహణకు అవసరమైన అనుమతులు జారీకి సింగిల్‌విండో సెల్ ఏర్పాటుచేశారు. వ్యయంపై ఎప్పటిక ప్పుడు ఫిర్యాదులు పరిశీలించి అంచనా వేయడానికి ఒక సెల్, మీడియా కోసం మరో సెల్ తెరిచారు. అభ్యర్థులు పత్రికలు/టీవీలకు ఇచ్చే ప్రకటనలను అనుమతులు మంజూరు చేయడం, అనుమతిలేని ప్రకటనలు వస్తుంటే ఫిర్యాదులు నోట్ చేయడానికి మీడియా సర్టిఫికేషన్ అండ్ మోనటరింగ్ సెల్, అలాగే సామాజిక మాధ్యమాల్లో జరిగే ప్రచారం, తప్పుడు ... మిగతా 6వ పేజీలో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (మంగళ)	6.11
సహరి (బుధ)	4.46

ఎన్జీవో సేవలకు జీవీఎంసీ నిధులు!

ఎకో వైజాగ్ పేరుతో కార్యక్రమాలు

వాటన్నింటికీ బిల్లులు పెడుతున్న సంస్థ నిర్వాహకులు

- అభ్యంతరం చెప్పకుండానే ఆమోదించేస్తున్న అధికారులు
- ఉచిత సేవలకు బిల్లుల చెల్లింపుపై విమర్శలు
- ప్రస్తుతం కమిషనర్ వద్ద పెండింగ్‌లో ఫైల్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)



ప్రజాహితం కోసం స్వచ్ఛంద సంస్థలు అనేక కార్యక్రమాలు చేపడుతుంటాయి. సొంతంగా సమకూర్చుకున్న నిధులు, ఇతరుల నుంచి విరాళాలుగా సేకరించిన మొత్తంతో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తాయి. కానీ జీవీఎంసీ పరిధిలో 'ఎకో వైజాగ్' పేరిట ఓ స్వచ్ఛంద సంస్థ కార్యక్రమాలు చేపట్టి, ఆ పనులు చేసినందుకు డబ్బు చెల్లించాలంటూ జీవీఎంసీకి బిల్లులు పంపడం చర్చనీయాంశంగా మారింది. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేయాల్సిన అధికారులు బిల్లులు చెల్లిస్తుండడంపై పెద్దఎత్తున చర్చ జరుగుతోంది.

జీవీఎంసీ కమిషనర్‌గా సాయికాంత్‌వర్మ బాధ్యతలు చేపట్టిన తర్వాత నగరంలో ప్లాస్టిక్ నియంత్రణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు 'ఎకో వైజాగ్' పేరుతో ఓ కార్యక్రమం రూపొందించారు. ఇందులో భాగంగా ఎకో-గ్రీన్, ఎకో-క్లీన్, ఎకో-జీరో ప్లాస్టిక్, ఎకో-పొల్యూషన్...అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టారు. దీనికి తాము కూడా సహకరిస్తామంటూ నగరానికి చెందిన రెండు స్వచ్ఛంద సేవా సంస్థలు (ఎన్జీవో) ముందుకు వచ్చాయి. ఎకో వైజాగ్‌పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అవసరమైన కార్యక్రమాలకు రూపకల్పన చేయడంతో పాటు ఆయా కార్యక్రమాలను తామే నిర్వహిస్తామని, సహకారం అందిస్తే చాలని జీవీఎంసీ అధికారులను కోరాయి. దీనివల్ల జీవీఎంసీకి ఎలాంటి ఆర్థిక భారం ఉండదనే భావనతో అధికారులు సమ్మతించారు. ఈ మేరకు ఆరు నెలల కిందట ఎకో వైజాగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు వీలుగా పోర్టు స్టేడియంలో పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. అనంతరం వినాయకచవితి సందర్భంగా మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేశారు. తర్వాత 'పెయింట్ మై స్ట్రీట్' పేరుతో నగరంలోని ప్రభుత్వ కార్యాలయాలు, పార్కుల ప్రహరీలపై సందేశాత్మక చిత్రాలను వేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమాల ప్రమోషన్‌లో భాగంగా తమ సంస్థ లోగోతోపాటు జీవీఎంసీ లోగోను ముద్రించి జీవీఎంసీ అధికారుల వద్ద సానుకూల అభిప్రాయాన్ని పొందారు.

జీవీఎంసీ సిబ్బందికే బెదిరింపులు

అయితే వినాయక చవితి సందర్భంగా మట్టి ప్రతిమల పంపిణీకి రూ.4 ... మిగతా 6వ పేజీలో

సర్టిఫికెట్ల కోసం పాట్లు

- ధ్రువపత్రాలన్నింటిపైనా సీఎం చిత్రం
- ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఇప్పుడు జారీ నిలిపివేయాల్సిన పరిస్థితి
- జూన్ రెండో వారంలో రావాలంటున్న సిబ్బంది
- ఉన్నతాధికారులు స్పందించాలంటున్న ప్రజానీకం




సర్టిఫికెట్‌పై సీఎం జగన్ బొమ్మ

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రచారం కోసం అన్నింటిపై తన ఫొటోలు వేసుకోవడం వల్ల ఇప్పుడు విద్యార్థులు నానాపాట్లు పడుతున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో ఎక్కడ కూడా నాయకుల ఫొటోలు ఉండకూడదని ఎలక్షన్ కమిషన్ స్పష్టంచేసింది. ఆఖరుకు తహసీల్దార్ కార్యాలయాల ద్వారా ఇచ్చే ధ్రువపత్రాలు, పాస్‌బుక్‌లపై కూడా ఫొటోలు ఉంటే వాటి జారీని నిలిపివేయాలని ఆదేశించింది. దాంతో విద్యార్థులకు ఇక్కట్లు మొదలయ్యాయి.

ఇది పిల్లలను విద్యాలయాల్లో చేర్పించే సీజన్. పుట్టిన తేదీ సర్టిఫికెట్లు, కుల ధ్రువీకరణ పత్రాలు, ఆదాయం సర్టిఫికెట్లు, ఆర్థికంగా వెనుకబడిన వారనే ధ్రువీకరణ పత్రాలు తీసుకోవలసి ఉంటుంది. వీటి కోసం సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే, వాటిని సంబంధిత తహసీల్దార్ కార్యాలయాలకు పంపించి, పరిశీలించాక జారీచేస్తారు. వాటిని ... మిగతా 6వ పేజీలో

ప్రశాంతంగా టెన్త్ పరీక్షలు



నగరంలోని ఓ పరీక్షా కేంద్రంలో తనిఖీ చేస్తున్న కలెక్టర్ మల్లికార్జున. చిత్రంలో డీఈవో చంద్రకళ ఉన్నారు


- వార్త I పేజీలో

- 98.7 శాతం హాజరు
- కలెక్టర్, డీఈవో, ఆర్జేడీ తనిఖీలు

పదో తరగతి పరీక్షలు సోమవారం జిల్లాలోని 138 కేంద్రాల్లో ప్రశాంతంగా జరిగియి. తొలి రోజు ఫస్ట్ లాంగ్వేజ్‌కు 29,040 మందికిగాను 28,673 మంది (98.7 శాతం) హాజరయ్యారు.

ఖర్చులు తగ్గించండి, ఉత్పత్తి పెంచండి

- లాభాలు వస్తేనే పే రివిజన్
- ప్లాంటును నడపడానికి అవసరమైనవన్నీ యాజమాన్యమే సమకూర్చుకోవాలి
- స్పష్టం చేసిన స్టీల్ మంత్రిత్వ శాఖ అధికారి



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం స్టీల్‌ప్లాంటుకు కేంద్రం ఎటువంటి సహకారం అందించదని స్టీల్ మంత్రిత్వ శాఖకు చెందిన అధికారి ఒకరు స్పష్టంచేశారు. రెండు రోజుల పర్యటనకు వచ్చిన ఆయన పలువురు అధికారులు, ఉద్యోగులు, కార్మికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్లాంటు ఎదుర్కొంటున్న ముడి పదార్థాల సమస్యతో పాటు పే రివిజన్, ప్రమోషన్లు గురించి ఉద్యోగులు, కార్మికులు ప్రస్తావించారు. దానికి ఆయన చాలా స్పష్టమైన సమాధానం ఇచ్చారు. ఐరన్‌ఓర్ కోసం ఎన్ఎండీసీపై పూర్తిగా ఆధారపడవద్దని సూచించారు. అలాగే ... మిగతా 6వ పేజీలో

సచివాలయం పక్కనే సీఎం, వైసీపీ నేతల ఫ్లెక్సీ!



నరసింహనగర్ పార్కులో జగన్, నేత ఫ్లెక్సీ

అక్కయ్యపాలెం, మార్చి 18: ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిన నేపథ్యంలో రాజకీయ నాయకుల చిత్ర పటాలతో కూడిన బ్యానర్లు, పోస్టర్లు తొలగించాలి. కానీ, వాటిని సచివాలయ అధికారులు, జీవీఎంసీ సిబ్బంది తొలగించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. గ్రేటర్ 14వ వార్డు నరసింహనగర్ పార్కులో విద్యుత్ స్తంభానికి ఉన్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఫొటోతో పాటు వైసీపీ ఉత్తర నియోజకవర్గనేత చిత్రాన్ని తొలగించలేదు.సచివాలయానికి ఆనుకుని ఈ పార్కు ఉన్నా ఈ ఫ్లెక్సీ సిబ్బందికి కనిపించలేదా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. అలాగే, అక్కయ్యపాలెం పరిసరాల్లో పలుచోట్ల అధికార పార్టీకి చెందిన నాయకుల ఫ్లెక్సీ బ్యానర్లు చాలా దర్శనమిస్తున్నారు.

లేపాక్షి వద్ద పూడిక తొలగింపు

జగదాంబ కూడలి, మార్చి 18: జగదాంబ దరి లేపాక్షి, వాచ్‌హౌస్ మెయిన్ రోడ్డు పై మురుగు నీటినుంచి విముక్తి లభించింది. సోమవారం లేపాక్షి, ఇండస్ వైపు రోడ్డు మీద కాలువల్లో వ్యర్థాలు, పూడికలను జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు పర్యవేక్షణలో తొలగించారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు లేపాక్షి దరి వద్ద కాలువలనుంచి మురుగునీరు రహదారిపైకి రావడంతో జనాలు ఇబ్బందులు పడ్డారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావడంతో చర్యలకు దిగారు. లక్కీమాల్ వద్ద కాలువల్లో పూడికలను జేసీబీలతో తొలగించారు.



జేసీబీతో పూడికలు తొలగిస్తున్న దృశ్యం

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, మార్చి 18: అక్కయ్యపాలెం సెక్షన్ పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్నందున మంగళవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ బి.సింహచలం నాయుడు తెలిపారు. గండిబాబ్జీ ఆఫీస్ ఏరియా, వినాయక ఆలయం సమీపం గ్రీన్‌పార్కు ఏరియాల్లో కరెంట్ సరఫరా ఉండదన్నారు.



అచ్చిబాబు కళ్యాణమండం వద్ద గ్రీన్ బెల్ట్ దుస్థితి



తెగిపడిన ఇనుప కంచె

మూన్నాళ్ల ముచ్చటే...!

- గ్రీన్‌బెల్ట్ పార్కుల్లో నాణ్యతా లోపంతో పనులు
- విరిగిన సిమెంట్ బెంచీలు, బల్లలు
- చీకటి పడితే మందుబాబుల ఆగడాలతో బెంబేలు

కంచరపాలెం, మార్చి 18: జాతీయ రహదారి పొడవునా గ్రీన్ బెల్ట్‌ల్లో సుందరీకరణ పేరిట ఇటీవల చేపట్టిన అభివృద్ధి పనులు మూన్నాళ్ల ముచ్చటగా మారాయి. కొన్నిచోట్ల కూర్చునేందుకు వేసిన సిమెంట్ బెంచీలు విరిగిపోయాయి. మరికొన్నిచోట్ల పార్కులో వేసిన వాకింగ్ ట్రాక్‌లు గోతులతో నిండి ఉంటున్నాయి. గ్రీన్‌బెల్ట్‌లో పచ్చదనం పెంపొందించడంతోపాటు వాటిని పార్కులుగా అభివృద్ధి చేస్తే స్థానికులకు ఉపయోగకరంగా ఉంటుందన్న ఆలోచనతో ప్రభుత్వం కంచరపాలెం నుంచి ఎన్‌ఏడీ జంక్షన్ వరకు గల అనువైన ప్రదేశాల్లో లక్షలాది రూపాయలు వెచ్చించారు. అయితే, ఇలా ఈ పనులు నాణ్యతా లోపంతో చేపట్టడంతో మూడు నెలల గడవక ముందే వృథాగా మారాయి. పలుచోట్ల పార్కుల్లో బెంచీలు, బల్లలు, చుట్టూ వేసిన ఇనుప కంచె శిథిలమైంది. కంచరపాలెం అచ్చిబాబు కల్యాణ మండపం సమీపంలో నిర్మించిన పార్కులో సేద తీరడానికి వేసిన సిమెంట్ బెంచీలు పగిలిపోవడంతో కూర్చోవడానికి అవకాశం లేకుండా పోతోంది. సమీపాన పార్కుల్లో పశువులను పెంచుతున్నారు. అదేవిధంగా ఇక్కడ సాయంత్రంచీకటిపడగానే ఆకతాయిలు ప్రవేశించి మద్యం సేవించడం, ఇతర అసాంఘిక కార్యకలాపాలు చేపడుతున్నారు. దీంతో పార్కులోకి రావడానికి స్థానికులతో పాటు మహిళలు భయపడుతున్నారు. దీంతో ప్రభుత్వం వీటిని ఏర్పాటు చేసిన లక్ష్యం నిర్వీర్యమవుతుందని పలువురు వాపోతున్నారు. ఇకనైనా అధికారులు చర్యలు చేపట్టి విరిగిపోయిన బెంచీల స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేయాలని, అదేవిధంగా మందుబాబుల చొరబడకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



విరిగిని సిమ్మెంట్ బెంచీ



పార్కులో మద్యం సీసాలు

ఆటోనగర్‌పై మాట తప్పిన ఎమ్మెల్యే వాసుపల్లి: సిటు

జగదాంబ కూడలి, మార్చి 18: నగరంలో స్క్రాప్ వర్కర్ల కోసం రాజన్న ఆటోనగర్ నిర్మించి అందిస్తామన్న దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌కుమార్ మాట తప్పారని సీఐటీయూ నాయకుడు వై. రాజు, స్క్రాప్ వర్కర్ల సంఘం కార్యదర్శి గణేశ్ ఆరోపించారు. సోమవారం సీపీఎం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలోని స్క్రాప్ వర్కర్ల షాపులను నగర శివారుకు తరలించాలనే ఆలోచనతో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఆనందపురం సమీపాన కణమాం గ్రామం వద్ద 157.7 ఎకరాలను కేటాయిందన్నారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం రాజన్న ఆటోనగర్ పేరిట ఈ గ్రామంలో స్క్రాప్‌వర్కర్లకు షాపులు నిర్మించి ఇస్తామని గొప్పలు చెప్పిందన్నారు. అయితే, నేటికీ రాజన్నఆటోనగర్ నిర్మాణం చేపట్టలేదన్నారు. వైసీపీ నేత వైవీ సుబ్బారావు ఆధ్వర్యంలో వన్‌టౌన్ మున్సిపల్ స్టేడియంలో భారీ సమావేశం ఏర్పాటు చేసి ఎమ్మెల్యే వాసుపల్లి దీనిపై ఇచ్చిన హామీ నేటికి నేరవవేర్చలేదని విమర్శించారు.



మాట్లాడుతున్న సిటు నాయకులు

'కొప్పుల వెలమలకు న్యాయం చేయాలి'

డాబాగార్డెన్స్, మార్చి 18: అనకాపల్లి, విజయనగరం పార్లమెంట్ స్థానాలను కొప్పుల వెలమలకు ప్రధాన రాజకీయ పార్టీలు కేటాయించాలని కొప్పుల వెలమ రాష్ట్ర సంక్షేమ సంఘం అధ్యక్షుడు కిలపర్తి పరదేశీనాయుడు స్పష్టం చేశారు. సోమవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లోని సుమారు 28 లక్షల మంది, ఉత్తరాంధ్ర జిల్లాల్లోనే సుమారు 20 లక్షలపైగా కొప్పుల వెలమ కులస్తులు ఉన్నట్టు వివరించారు. అనకాపల్లి పార్లమెంట్ పరిధిలో నర్సీపట్నం, పాయకరావుపేట, యలమంచిలి, పెందుర్తి, చోడవరం, మాడుగుల నియోజకవర్గాలలో అత్యధికంగా తమ సామాజిక వర్గం ఉందన్నారు. రాష్ట్ర బీసీ కులాలలో రెండవ అతిపెద్ద కులం తమదన్నారు. విజయనగరం పార్లమెంట్ పరిధిలో ఒక్కటంటే ఒక్క అసెంబ్లీ టికెట్ కూడా కేటాయించకపోవడం అన్యాయమన్నారు. ఈ సమావేశంలో విజయనగరం అధ్యక్షులు బొత్స వరప్రసాద్, గౌరవాధ్యక్షులు శీర సత్యనారాయణ, అసోసియేటెడ్ అధ్యక్షులు దొగ్గ దేముడు, గుణుపూరు రామారావు, మేళాపు శ్రీహరినాయుడు పాల్గొన్నారు.

'అందరి సహకారంతో కాంగెస్ సభ విజయవంతం'

సీతోపేట, మార్చి 18: కార్మికులు, ప్రజల సహకారంతో విశాఖలో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఇటీవల నిర్వహించిన సభ విజయవంతమైందని మాజీ సర్పంచ్, ఆ పార్టీ నాయకుడు పాశర్ల ప్రసాద్ తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల తాను టీడీపీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరన్నారు. బహిరంగ సభ వేదికగా కాంగ్రెస్ పార్టీ విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా డిక్లరేషన్ ప్రకటించందన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్నట్టు పీసీసీ అధ్యక్షురాలు షర్మిల చెప్పారన్నారు. జగన్ ఆంధ్రప్రదేశ్‌ను అప్పుల ఊబిలోకి నెట్టేశారన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిల్ల పైడిరాజు, రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శివకుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పాశర్ల ప్రసాద్

ఏయూ హాస్టల్ వార్డెన్‌పై విచారణకు ఎస్సీ కమిషన్ ఆదేశం

విశాఖపట్నం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని ఓ వసతి గృహానికి వార్డెన్‌గా పనిచేస్తున్న అధికారిపై విచారణ చేసి నివేదిక అందించాలని జాతీయ ఎస్సీ కమిషన్ ఏయూ వైస్ చాన్సలర్, నగర పోలీస్ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు 11వ తేదీన ఎస్సీ కమిషన్ డైరెక్టర్ డాక్టర్ జి సునీల్ కుమార్ బాబు నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. ఏయూలో న్యాయ కళాశాలలో విద్యార్థిని వు మెన్స్ హాస్టల్‌లో ఉంటోంది. హాస్టల్ అధికారులు వెజ్ నుంచి నుంచి నాన్ వెజ్‌కు, నాన్ వెజ్ నుంచి వెజ్‌కు మారిన ప్రతిసారి హాస్టల్ అధికారులు అదనంగా ఫీజు వసూలు చేస్తున్నారు. నెల మొత్తం హాస్టల్ తెరిచి ఉన్నప్పుడు మాత్రమే పూర్తి ఫీజు వసూలు చేయాలి. సెలవులు ఉంటే ఆ మొత్తాన్ని కట్ చేసి విద్యార్థులు నుంచి ఫీజులు తీసుకోవాలి. కానీ, ఇక్కడి అధికారులు పూర్తి ఫీజును విద్యార్థులు నుంచి వసూలు చేస్తున్నారు. ఈ అంశాలపై దృష్టి సారించిన న్యాయ కళాశాల విద్యార్థిని.. సమాచార హక్కు చట్టం కింద గతేడాది అక్టోబరు మూడో తేదీన దరఖాస్తు చేశారు. దీనిపై సమాచారాన్ని అరకొర ఇవ్వడమే కాకుండా దరఖాస్తు వెనక్కి తీసుకోవాలంటూ సదరు వార్డెన్ విద్యార్థినిపై వేధింపులకు పాల్పడ్డారు. తోటి విద్యార్థుల ఎదుట ఆవిద్యార్థిని బెదిరించడంతోపాటు దుర్భాషలాడారు. దీంతో తీవ్రంగా మానసిక వేదనకు గురైన సదరు బాధిత విద్యార్థిని గతేడాది డిసెంబర్ 12న ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు.పరిగణలోకి తీసుకున్న ఎస్సీ కమిషన్ 30 రోజుల్లో విచారణ జరిపి నివేదిక అందించాలని ఆదేశించింది. దీనిపై ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జేమ్స్ స్టీఫెన్‌ను వివరణ కోరగా.. ఈ విషయం తన దృష్టికి రాలేదన్నారు.

కేన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలి



మందులు పంపిణీ చేస్తున్న టీడీపీ నేత శ్రీభరత్

పూర్ణామార్కెట్, మార్చి 18: కేన్సర్ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని టీడీపీ విశాఖ పార్లమెంట్ అభ్యర్థి భరత్ అన్నారు. సోమవారం గ్రేటర్ 39వ వార్డు కోటవీధి ఏరియాలో ని ఆంగ్లోఇండియన్ భవనంలో గీతం, బసవతారం ఇండో అమెరికన్ కేన్సర్ ఆసుపత్రులు సంయుక్త నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేన్సర్ వ్యాధి సోకిన వారు ఆధైర్య పడనవసర లేదని, చికిత్స ద్వారా నివారణ సాధ్యమన్నారు. బసవతారం కేన్సర్ టీమ్ వైద్యులు ఉచితంగా వైద్యపరీక్షలు చేసి వ్యాధి అనుమానిత కేసులను గుర్తించారు. ఉచితంగా రోగులకు వైద్యమందించనున్నారు. ఈకార్యక్రమంలో జనసేన దక్షిణ అభ్యర్థి వంశీ, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

'దక్షిణ' టికెట్ స్థానిక నేతలకే అవకాశమివ్వాలి'

డాబాగార్డెన్స్, మార్చి 18: దక్షిణ నియోజక వర్గ టికెట్ స్థానిక నేతలకే కేటాయించాలని నియోజకవర్గ నాయకులు డా.మూగి శ్రీనివాస్, కార్పొరేటర్ మహమ్మద్ సాధిక్ కోరారు. సోమవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. స్థానిక ప్రజల మనోభావాలను పరిగణలోకి తీసుకుని అభ్యర్థిని ప్రకటించాలన్నారు. గత 15 ఏళ్లగా ప్రజల్లో ఉన్న నాయకులకు టికెట్ వ్వాలన్నారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు మేడిశెట్టి రమణ, వెంకటరావు, దేముడు, రూప, తులసి, కనక మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'పారిశుధ్యంపై పాలకుల నిర్లక్ష్యం'

పూర్ణామార్కెట్, మార్చి 18: ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే కోటవీధి, ఫెర్రీరోడ్డు పరిసరాల్లో పారిశుధ్య లోపం తాండవిస్తోందని టీడీపీ విశాఖ పార్లమెంట్ అభ్యర్థి శ్రీభరత్ ఆరోపించారు. సోమవారం గ్రేటర్ 39వ వార్డులో పర్యటించారు. ఈసందర్భంగా స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. లక్కీటాకీస్ వద్ద కాలువ నిర్మాణంలో జాప్యం వల్ల ఫెర్రీ రోడ్డు వద్ద మురుగునీటి నిల్వలతో స్థానికులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నట్టు పార్టీ శ్రేణులు ఆయన దృష్టికి తెచ్చాయి. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన ప్రజలకు హామీ ఇచ్చారు. టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోల్ బాల్ అసోసియేషన్ వార్షికోత్సవం

మురళీనగర్, మార్చి 18; విశాఖ రోల్ అసోసియేషన్ మూడో వార్షికోత్సవాన్ని సోమవారం మురళీనగర్‌లో నిర్వహించారు. 50వవార్డులో వైశాఖీ స్పోర్ట్సు పార్కు వేదికగా కొనసాగుతున్న ఈ అసోసియేషన్ మరింత ప్రగతి సాధించాలని ఈ సందర్భంగా స్పోర్ట్సు పార్కు అధ్యక్షులు సనపల.వరప్రసాద్ అన్నారు. పలువురు క్రీడాకారులకు మెమొంటోలు అందించారు. విశాఖ రోల్ బాల్ అసోసియేషన్ సెక్రటరీ తోట.లలిత ప్రియ, కోచ్ సంతోష్‌లను ఈసందర్భంగా అభినందించారు. అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరించారు. వైశాఖీ స్పోర్ట్సు సెక్రటరీ సూర్యనారాయణ ఉన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న వరప్రసాద్

ఎన్జీవో సేవలకు జీవీఎంసీ నిధులు!

... 5వ పేజీ తరువాయి

లక్షలు ఖర్చు చేశామని, ఆ మొత్తం చెల్లించాలంటూ జీవీఎంసీకి బిల్లు పెట్టారు. అలాగే ఆర్ట్ కాంపిటేషన్ సందర్భంగా రంగుల కొనుగోలు, ఆర్టిస్టులకు చెల్లించడానికి అయిన ఖర్చుల పేరుతో మరో రూ.రెండు లక్షలకు బిల్లు పెట్టినట్టు సమాచారం. స్వచ్ఛంద సేవలకు బిల్లు చెల్లించడం కుదరదని తనను కలిసిన ఎన్జీవో సంస్థ ప్రతినిధికి ఓ జూనియర్ అసిస్టెంట్ చెప్పగా...అందుకు అతను 'నేనెవరో మీకు తెలియదనుకుంటా...నా పెళ్లికి జీవీఎంసీ కమిషనర్ హాజరయ్యారు. నాకు జనవరి 26న అవార్డు కూడా ఇచ్చారు తెలుసా' అని హెచ్చరింపు ధోరణిలో మాట్లాడారు. అయినప్పటికీ బిల్లు కోసం ఫైలు పెట్టలేనని సదరు జూనియర్ అసిస్టెంట్ తెగేసి చెప్పినట్టు తెలిసింది.

అధికారి నిర్వాకంతోనే...

దీంతో ఆ ఎన్జీవో ప్రతినిధి నేరుగా జీవీఎంసీలోని ఉన్నతాధికారిని కలిసి జూనియర్ అసిస్టెంట్‌పై ఫిర్యాదు చేశారు. దీంతో ఆ అధికారి వెనుకాముందు ఆలోచించకుండా జూనియర్ అసిస్టెంట్‌కు ఫోన్ చేసి చెడామడా వాయించేసినట్టు సమాచారం. రూల్స్ గురించి మాట్లాడకుండా బిల్లు సిద్ధం చేయాలని ఆదేశించడంతో జూనియర్ అసిస్టెంట్ తనకెందుకొచ్చిందని పని చేసేశారు. ఈ ఫైలు ప్రస్తుతం కమిషనర్ వద్ద పెండింగ్‌లో ఉన్నట్టు సమాచారం. కాగా స్వచ్ఛంద సేవకు కూడా ప్రజా ధనం చెల్లించడం ఏమిటంటూ జీవీఎంసీలోని కొంతమంది అధికారులే ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

అధిష్ఠానం ఆదేశాలను పాటించాలి

- జనసేన పార్టీ ఉత్తర ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్

సీతమ్మధార, మార్చి 18: అధిష్ఠానం ఆదేశాల మేరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు నడుచుకోవాలని జనసేన ఉత్తర నియోజకవర్గ ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో నాయకులు, వార్డు అధ్యక్షులతో ఉషాకిరణ్ చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఉత్తర నియోజకవర్గంలో అభ్యర్థుల గెలుపు కాపులు నిర్దేశించిన స్థాయిలో ఉన్నారని అభి ప్రాయం వ్యక్తంచేశారు. 2009 ఎన్నికల్లో కూడా ప్రజారాజ్యం పార్టీ అతి తక్కువ ఓట్లతో గెలుపునకు దూరమైనట్టు చెప్పారు. పార్టీ పిలుపు మేరకు నిత్యావసర వస్తువుల ధర, ఆర్‌సీ, విద్యుత్ చార్జీలు పెంపునకు నిరసనగా బాదుడే బాదుడూ తదితర కార్యక్రమాలు విజయవంతం చేసినట్టు పలువురు నాయకులు,కార్యకర్తలు వివరించారు. పవన్‌కల్యాణ్ నియోజకవర్గం సీటును జనసేన పార్టీకి కేటాయిస్తే అత్యధిక మెజారిటీతో గెలిపిస్తామని వెల్లడించారు. నాయకులు నీరుకొండ దివాకర్, టి.శ్రీధర్, ముమ్మిన నాగమణి, పడాల పరమేశ్వరరావు, అల్లి మురళి, భాస్కర్, మాణిక్యాలరావు, శివ సతీష్, గారపాటి లక్ష్మి, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉషాకిరణ్

ఎన్నికల నిర్వహణకు పటిష్ట చర్యలు

విశాఖపట్నం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించడానికి పటిష్ట చర్యలు చేపట్టాలని, ప్రతి అంశంపై అవగాహన కల్పించుకుని విధులు నిర్వహించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టరు ఎ. మల్లికార్జున అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మానటరింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రాల్లో నిర్వహించాల్సిన విధులు, బాధ్యతలు, నిబంధనలు తెలుసుకోవాలన్నారు. అనంతరం కమాండ్ కంట్రోల్‌రూమ్, వెబ్ కాస్టింగ్ రూమ్, కాల్ సెంటర్ పరిశీలించారు.ఈసందర్భంగా కంట్రోల్ రూమ్‌ను కలెక్టర్ ప్రారంభించారు. ఎన్నికల కోడ్ ముగిసే వరకు కంట్రోల్‌రూమ్ సేవలు అందిస్తోందని తెలిపారు.

రామ్‌నగర్‌లో వెలగపూడి విస్తృత ప్రచారం



రామ్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న వెలగపూడి తదితరులు

రామ్‌నగర్, మార్చి 18: తూర్పు నియోజకవర్గ పరిధి 28వ వార్డు రామ్‌నగర్‌లో శాసనసభ్యుడు వెలగపూడి రామకృష్ణ ఆధ్వర్యంలో బీజేపీ, జనసేన, టీడీపీ శ్రేణులు సోమవారం ప్రచారం చేశాయి. రామకృష్ణ.. బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ, సూపర్ సిక్స్, మహాశక్తి పథకాలను ఇంటింటికి వెళ్లి వివరించారు. ఈసందర్భంగా స్థానికులు వెలగపూడికి ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి నక్కా కనకరాజు, నాయకులు బొట్టా వెంకటరమణ, పోతన రెడ్డి,మద్దిల రాజశేఖర్, నక్కా అన్నపూర్ణ, పల్లా ఉమారాణి, జగన్నాథం, నకెళ్ల త్రినాధ్,కళ్యాణి, నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున్న పాల్గొన్నారు.

వైసీపీపై యాదవుల గుస్సా

... 5వ పేజీ తరువాయి

చట్టసభల్లో ప్రాతినిధ్యం లేకుండా చేస్తే వారి పని కూడా చూడాల్సి ఉంటుందని పరోక్షంగా హెచ్చరించినట్టు తెలిసింది. దీంతో యాదవ సామాజిక వర్గానికి చెందిన వైసీపీ కార్పొరేటర్లు, తూర్పు నియోజకవర్గంలో కీలకంగా వ్యవహరిస్తున్న అదే సామాజిక వర్గానికి చెందిన నేత ఇటీవల పార్టీ ప్రాంతీయ సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డిని కలిసి తమ పరిస్థితి వివరించినట్టు తెలిసింది. ఎలాగైనా జిల్లాలో ఏదో ఒక సీటును తమ సామాజిక వర్గానికి కేటాయించాలని, లేనిపక్షంలో తాము రాజకీయంగా భవిష్యత్తు కోల్పోవడంతోపాటు పార్టీకి కూడా వచ్చే ఎన్నికల్లో ఇబ్బందులు తప్పకపోవచ్చునని వివరించినట్టు తెలిసింది. అభ్యర్థుల ప్రకటన జరిగిపోయినందున సీటు మార్చాలంటే తన చేతిలో లేదని, పార్టీ అధ్యక్షుడి దృష్టికి తీసుకువెళతానని సుబ్బారెడ్డి వారికి హామీ ఇచ్చినట్టు సమాచారం. గాజువాక నియోజకవర్గ సమన్వయకర్తగా వారం రోజుల కిందటి వరకూ యాదవ సామాజిక వర్గానికే చెందిన చందూ సమన్వయకర్తగా వ్యవహరించారని, ఆ సీటును ఇప్పుడు మార్చడం వల్ల ఎలాంటి ఇబ్బంది ఉండదని సుబ్బారెడ్డిని కలిసిన నేతలు వివరించగా, ఆ ప్రతిపాదనను కూడా సీఎందృష్టికి తీసుకువెళతానని ఆయన చెప్పినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలోవైసీపీ అధిష్ఠానం ఏ నిర్ణయం తీసుకుంటుందో చూడాలి. యాదవ సామాజిక వర్గాన్ని పక్కనపెట్టినట్టయితే జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో ప్రభావం పడే అవకాశం ఉందని ఆ పార్టీలో ఉన్న నేతలే ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

దక్కని దీవెన

... 5వ పేజీ తరువాయి

ఒకటో తేదీన విడుదల చేసింది. ఫైనల్ ఇయర్ చదువుతున్న ఒక విద్యార్థి, తల్లి ఉమ్మడి ఖాతాలో కిందట రూ.16,925 జమ అయింది. ఈ మొత్తాన్ని చెల్లించేందుకు వెళ్లిన సదరు విద్యార్థికి... మిగిలిన మూడు విడతల ఫీజు కలిపి చెల్లించాలంటూ కాలేజీ యాజమాన్యం స్పష్టంచేసింది. లేదంటే హాల్ టికెట్ ఇచ్చేది లేదని తేల్చిచెప్పింది. చేసేదేమీ లేక మొత్తం ఫీజు చెల్లించాడు. ఇలా...ఒక్కో విద్యార్థిపై కాలేజీని బట్టి కనీసం రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు భారం పడనున్నది. యాజమాన్యాల ఒత్తిడి భరించలేక ఇంజనీరింగ్, డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థుల్లో దాదాపు 50 శాతం మంది ఫీజులను చెల్లించేశారు. కొన్ని యాజమాన్యాలు ఫీజులు చెల్లించేంత వరకూ కాలేజీలకు రావద్దని బహిరంగంగానే చెబుతున్నాయి. ఉన్నతాధికారులు కూడా పట్టించుకోకపోవడంతో ఎవరికి చెప్పుకోవాలో కూడా అర్థం కావడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇదిలావుండగా కొంతమందికి తొలి విడత సొమ్ము కూడా ఇంకా జమ కాలేదు. 20 శాతం మంది విద్యార్థులకు అందాల్సి ఉందని చెబుతున్నారు.

'వసతి దీవెన' నిల్

స్కాలర్‌షిప్ మొత్తాన్ని రెండు విడతల్లో జగనన్న వసతి దీవెన కింద చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఒక్కో విడత పది వేలు చొప్పున రూ.20 వేలు చెల్లించాల్సి ఉంది. అయితే, 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇప్పటివరకూ ఒక్క విడత కూడా వసతి దీవెన మొత్తాన్ని ప్రభుత్వం జమ చేయలేదు. ఇంకా చెప్పాలంటే...గడిచిన విద్యా సంవత్సరానికి సంబంధించి వందలాది మందికి వసతి దీవెన నిధులు అందలేదు. అధికారులను అడుగుతున్నా స్పందన లేదని పలువురు చెబుతున్నారు. స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో గతంలో విధానాలను అమలు చేయాలని విద్యార్థులు చెబుతున్నారు.

ఖర్చులు తగ్గించండి, ఉత్పత్తి పెంచండి

... 5వ పేజీ తరువాయి

ఇతర ముడి పదార్థాలకు కూడా ఢిల్లీ వైపు చూడవద్దన్నారు. ప్లాంటును నడపడానికి అవసరమైనవన్నీ యాజమాన్యమే సమకూర్చుకోవాలన్నారు. ఖర్చులు తగ్గించుకోవాలని, ఉత్పత్తిని పెంచాలని, లాభాలు తీసుకురావాలని ఉద్బోధించారు. ప్లాంటు ఖర్చులుపోను ఏమైనా మిగిలితేనే జీతాల పెంపు (పే రివిజన్), పదోన్నతులు, పెన్షన్ల చెల్లింపు, గ్రాట్యుటీ వంటివి వస్తాయని వివరించారు. ఏ ఒక్కరు కూడా సాయం చేయరని, ఎవరి కష్టం వారిదేనని చాలా క్లియర్‌గా వెల్లడించారు. ప్లాంటుకు నష్టాలు వస్తే అంతిమంగా నష్టపోయేది ఉద్యోగులు, కార్మికులేనని హెచ్చరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు 2021లో లాభాలు వచ్చాయని, మరి అప్పుడు పే రివిజన్ చేయలేదని గుర్తుచేయగా, జరిగిపోయిందేదో జరిగిపోయిందని, ఇకపై జరగాల్సింది చూసుకోవాలని, అంతా సమష్టిగా పనిచేసి లాభాల బాటలోకి తేవాలని సూచించారు.

బయోమెట్రిక్‌పై తగ్గిని వ్యతిరేకత: ఈ నెల 8వ తేదీ నుంచి ప్లాంటులో ప్రతి ఒక్కరూ బయోమెట్రిక్ వేయాలని స్పష్టం చేసిన యాజమాన్యం అందుకు తగిన ఏర్పాట్లు చేసింది. అయితే కార్మిక సంఘ నాయకులు తమకు పే రివిజన్ చేయడంతో పాటు కొన్ని మౌలిక వసతులు కల్పించాలని, వాటిని నెరవేరిస్తేనే బయోమెట్రిక్ వేస్తామని వ్యతిరేకించిన సంగతి తెలిసిందే. బయోమెట్రిక్ వేయకపోతే రిజిస్టర్‌లో సంతకాలు చేయడానికి వీల్లేదని నిబంధన పెట్టడంతో సోమవారం అత్యధిక శాతం కార్మికులు వేలిముద్రలు వేసి విధులకు హాజరయ్యారు.

సర్టిఫికెట్ల కోసం పాట్లు

... 5వ పేజీ తరువాయి

దరఖాస్తుతో పాటు జత చేస్తే...ఆయా విభాగాల కింద విద్యార్థులకు రిజర్వేషన్ కల్పించి, సీట్లు కేటాయిస్తారు. ఈ ప్రాసెస్ అంతా పూర్తి కావడానికి వారం నుంచి పది రోజులు పడుతుంది. సచివాలయంలో ముందు దరఖాస్తు చేయాలి. ఎప్పటిలాగే అంతా సచివాలయాలకు వెళుతుంటే...అక్కడి సిబ్బంది వాటిని తీసుకోవడం లేదు. ఎన్నికల కోడ్ అమలులో ఉందని, సర్టిఫికెట్లు జారీ కావని చెప్పి తిరస్కరిస్తున్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిశాకే జూన్ రెండో వారంలో రావాలని చెబుతున్నారు. దాంతో తల్లిదండ్రులు లబోదిబోమంటున్నారు. జూన్‌లో ఏకంగా విద్యాలయాల్లో తరగతులు మొదలవుతాయని, అప్పుడు ఇస్తామంటే ఎలాగని వాపోతున్నారు. ఎన్నికలకు, సర్టిఫికెట్లకు సంబంధం ఏమిటని తెలియనవారు ప్రశ్నిస్తే...వాటిపై సీఎం బొమ్మ ఉంటుందని, అందుకే ఎన్నికల సంఘం వద్దని చెప్పిందని సమాధానమిస్తున్నారు. దాంతో ప్రజలు ఆగ్రహావేశాలు వ్యక్తంచేస్తున్నారు. పిల్లలకు ఇచ్చే సర్టిఫికెట్లు, పది కాలాలు భద్రపరుచుకునే పత్రాలపై నాయకుల బొమ్మలు ఎలా వేస్తారని, దానికి ఎవరు అనుమతి ఇచ్చారని ప్రశ్నిస్తున్నారు. గతంలో ఎప్పుడూ ఇలా లేదని, ఈ ప్రభుత్వం వచ్చాకే ఇలాంటి పనులు చేస్తున్నారని, ఇప్పుడు తమకు నెలాఖరులోగా సర్టిఫికెట్లు కావాలని, ఇవ్వకపోతే ఆందోళనకు దిగుతామని హెచ్చరించి వెళుతున్నారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలిగా...?: ప్రభుత్వ నిర్ణయాల వల్ల విద్యార్థులు, తల్లిదండ్రులు నష్టపోకుండా జిల్లా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. సీఎం, ఇతర నాయకుల బొమ్మలు ఏమీ లేకుండా ధ్రువపత్రాలు జారీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ సమస్యను ఎన్నికల సంఘానికి నివేదించి, తగిన పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

ఎన్నికల కోడ్ అమలుకు ప్రత్యేక విభాగాలు

... 5వ పేజీ తరువాయి

కథనాలను ఎప్పటికప్పుడు నమోదు చేయడానికి సోషల్ మీడియా సెల్‌ను ఏర్పాటుచేశారు. కొత్తగా ఎన్నికల సంఘం అందుబాటులోకి తెచ్చిన సీ.విజిల్ యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించడానికి మరొక సెల్‌ను ఏర్పాటుచేసి జీవీఎంసీ సిబ్బందిని నియమించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు కోసం జీవీఎంసీ కమిషనర్ సారథ్యంలో ఒక కమిటీ పనిచేస్తోంది. కాగా జాయింట్ కలెక్టర్ మయూర అశోక్ విశాఖ తూర్పు నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి కావడంతో నామినేషన్లు పరిశీలించేందుకు జేసీ ఛాంబర్ పక్కన ఒక సెల్ ఏర్పాటుచేశారు. ఇదిలావుండగా షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఎన్నికల విధుల నిర్వహణకు సంబంధించి అధికారులతో కలెక్టర్ మల్లికార్జున, జేసీలు ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నారు. రెవెన్యూతోపాటు పలు శాఖల అధికారులకు ఎన్నికల విధులు అప్పగించారు.

నియమావళిని పటిష్టంగా అమలు చేయాలి

విధుల నిర్వహణలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

గాజువాక ఎన్నికల రిటర్నింగ్ అధికారి డి.లక్ష్మారెడ్డి



గాజువాకలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న డి.లక్ష్మారెడ్డి

గాజువాక, మార్చి 18: ఎన్నికల నియామావళిని అందరూ పటిష్టంగా అమలు చేయాలని, సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని గాజువాక ఎన్నికల రిటర్నింగ్ అధికారి డి.లక్ష్మారెడ్డి సూచించారు. గాజువాక జోనల్ కార్యాలయంలో ఎన్నికల విధులకు సంబంధించి అధికారులు, సిబ్బందితో సోమవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రధానంగా రాజకీయ నాయకుల బోర్డులను తక్షణమే తొలగించాలని, విగ్రహాలన్నింటికీ ముసుగులు వేయాలన్నారు. ఏ రాజకీయ పార్టీతోనూ సంబంధాలు పెట్టుకోకుండా విధులు చేపట్టాలని, ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించే నాయకులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నగదు, బహుమతుల పంపిణీ చేయటం వంటివి ఎక్కడైనా చూస్తూ తక్షణమే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. సమన్వయంతో అన్ని విభాగాల వారు పని చేయాలన్నారు. సౌత్ ఏసీపీ టి.త్రినాథ్ మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలను అనుసరించి అందరూ విధులు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో ఏఈఆర్‌వోలు సన్యాసినాయుడు, శ్రీవల్లి, భాస్కరరావు, వివిధ పోలీస్ స్టేషన్ల సీఐలు, ప్రభుత్వ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



గాజువాక హైస్కూల్‌లో రూమ్‌ల వివరాలు చూసుకుంటున్న విద్యార్థులు



గాజువాకలోని ఓ పరీక్ష కేంద్రం వద్ద గుమిగూడిన విద్యార్థులు, తల్లిదండ్రులు



కణితి జిల్లా పరిషత్ పాఠశాలలో క్యూ లైన్‌లో లోపలకు వెళుతున్న విద్యార్థులు

టెన్త్ పరీక్ష కేంద్రాల వద్ద కోలాహలం

విద్యార్థులు, తల్లిదండ్రులతో సందడిగా మారిన పరిసర ప్రాంతాలు

గాజువాక/ఉక్కుటౌన్‌షిప్/కూర్మన్నపాలెం/అగనంపూడి/,గోపాలపట్నం, మార్చి 18: పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కావడంతో ఆయా కేంద్రాల వద్ద సందడి వాతావరణం నెలకొంది. గాజువాక, పెదగంట్యాడ మండలాల పరిధిలోని 26 కేంద్రాల్లో పరీక్షలు ప్రారంభమవ్వగా, సుమారు 5,415 మంది విద్యార్థులు రాస్తున్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష జరిగింది. తల్లిదండ్రులు తమ పిల్లలను ఆయా కేంద్రాల వద్ద దింపి పరీక్ష అయ్యేంత వరకు అక్కడే వేచివుండడంతో పరిసర ప్రాంతాలు కోలాహలంగా మారాయి. తొలిరోజు అన్ని కేంద్రాల్లోనూ పరీక్షలు ప్రశాంతంగా జరగ్గా, 144 సెక్షన్‌ను అమలు చేశారు. సౌత్ ఏసీపీ టి.త్రినాథ్ ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. తొలుత పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలతో సమీపంలోని ఆలయాలకు వెళ్లి పూజలు నిర్వహించారు. పలువురు ఆయా పరీక్ష కేంద్రాలకు కార్లు, ద్విచక్ర వాహనాల్లో రావడంతో కాసేపు ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి. కాగా కణితి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 250 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా అందరూ హాజరయ్యారని హెచ్ఎం సూర్యప్రకాశ్ తెలిపారు. అగనంపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 192 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలకు హాజరవ్వగా, వారి కోసం ఎనిమిది గదులను కేటాయించారు. ఒక్కో గదిలో 24 మందిని కూర్చోబెట్టారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టామని చీఫ్ సూపరింటెండెంట్ ప్రమీల తెలిపారు. అదేవిధంగా గోపాలపట్నం బాలుర ఉన్నత, బాలికోన్నత పాఠశాల, బాలాజీ స్కూల్ పరీక్ష కేంద్రాల్లో సుమారు 600 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ సిబ్బంది పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. గోపాలపట్నం మండల పరిధిలోని పలు పాఠశాలల్లో సుమారు 3,080 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు.



గోపాలపట్నం జెడ్పీ హైస్కూల్ వద్ద..

తొలిరోజే ప్రయాణ కష్టాలు..

పెందుర్తి: పదో తరగతి పరీక్షల తొలిరోజే బస్సుల సౌకర్యం లేక విద్యార్థులు అవస్థలు పడ్డారు. పరీక్షలు రాసే విద్యార్థులకు టికెట్ లేకుండా ఆర్టీసీ ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించింది. అయితే దూరాన ఉన్న కొన్ని పరీక్ష కేంద్రాలకు బస్సులు వెళ్లకపోవడంతో ఫలితం దక్కడం లేదు. దీంతో విద్యార్థులు ఆటోలను ఆశ్రయించారు. మండలంలోని కోటనరవ, చింతలగ్రహారం, గుర్రమ్మపాలెం పాఠశాలల్లో ఏర్పాటుచేసిన కేంద్రాలకు చేరుకునేందుకు బస్సులు అందుబాటులో లేవు. ఈ కేంద్రాల్లో సుమారు 400 మంది పరీక్ష రాస్తున్నారు. పెందుర్తి నుంచి గుర్రమ్మపాలేనికి సుమారు ఆరు కిలోమీటర్ల మేర విద్యార్థుల ఆటోల్లో వ్యయప్రయాసల మధ్య ప్రయాణించాల్సి వచ్చింది. ఆటో డ్రైవర్లు పరిమితికి మించి విద్యార్థులను తీసుకువెళ్లారు. పరీక్ష ముగిశాక మండు టెండలో మళ్లీ ఇళ్లకు చేరారు. అందువల్ల విద్యాశాఖ అధికారులు దూర ప్రాంతాలకు సైతం రవాణా సదుపాయం కల్పించవలసిందిగా విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



ఆటోలో గుర్రమ్మపాలెంలోని పరీక్ష కేంద్రానికి వెళ్తున్న విద్యార్థులు

ఖాతాదారులకు మెరుగైన సేవలు

కనకమహాలక్ష్మి కోఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ రాంబాబు

వెంకోజీపాలెం, మార్చి 18 : అన్ని రంగాల వారి అభివృద్ధి, ఉత్తమ సేవలే ధ్యేయంగా తమ బ్యాంకు పనిచేస్తోందని కనకమహాలక్ష్మి కోఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు అన్నారు. బ్యాంకు రజతోత్సవాల సందర్భంగా సోమవారం కంచరపాలెం, సీతమ్మధార బ్యాంకు శాఖల ఆవరణలో నిర్వహించిన ఖాతాదారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖాతాదారులకు తమ బ్యాంకు ద్వారా వినూత్న సేవలందిస్తూ వారి ఆదరణ పొందుతున్నామన్నారు. బ్యాంకు వైస్ చైర్మన్ జి. రామకృష్ణ మాట్లాడుతూ సీతమ్మధారలో తమ బ్యాంకు ఏర్పాటైన నాటి నుంచి ఖాతాదారుల, శ్రేయోభిలాషుల సహకారంతో ముందుకు సాగుతుందన్నారు. అనంతరం ఖాతాదారులు పలు సూచనలు చేయడంతో పాటు తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ఖాతాదారులను చైర్మన్ సత్కరించారు. ఈ సమావేశంలో బ్యాంకు డైరెక్టర్ బి. నాగేశ్వరరావు, సీఈఓ కె. శ్యామ్ కిషోర్, ఓఎస్‌డీ శాస్త్రి, ఆయా బ్రాంచిల మేనేజర్లు కె. విశ్వనాథం, దిలీప్, తదితరులు పాల్గొన్నారు.



ఖాతాదారున్ని సన్మానిస్తున్న బ్యాంకు అధికారులు



అధికారుల సమీక్ష సమావేశంలో ఈఆర్వో శేషశైలజ, ఏడీసీ విశ్వనాథ్

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కేసులు

» ఎన్నికల రిటర్నింగ్ అధికారి శేషశైలజ

పెందుర్తి, మార్చి 18: ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని పెందుర్తి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి.శేషశైలజ స్పష్టం చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఎన్నికల సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. విధి నిర్వహణలో ఎటువంటి నిర్లక్ష్యం చూపరాదన్నారు. ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా పని చేయాలన్నారు. ఏ రాజకీయ పార్టీలకు అనుకూలంగా ఉండరాదని, ఎన్నికల ప్రచారంలో పాల్గొనరాదని స్పష్టం చేశారు. ఎన్నికల కోడ్ కింద రాజకీయ పార్టీల నేతలు చేయాల్సినవి, చేయకూడనవి సిబ్బందికి వివరించారు. ఎన్నికల కోడ్ తూచా తప్పకుండా అమలు చేయాలన్నారు. ఈ క్రమంలో వైసీపీ, టీడీపీలపై కేసు నమోదుచేశామన్నారు.ఇటీవల పెందుర్తిలో వైసీపీ నిర్వహించిన ర్యాలీలో లౌడ్ స్పీకర్లకు అనుమతి లేదని, సబ్బవరంలో అనుమతిలేకుండా టీడీపీ చేపట్టిన ర్యాలీపై కోడ్ ఉల్లంఘన కింద కేసులు నమోదు చేశామన్నారు. అలాగే, నియోజకవర్గ ఎన్నికల ప్రత్యేక అధికారిగా వ్యవహరిస్తున్న ఏడీసీ విశ్వనాథ్ ఎన్నికల సిబ్బందిని ఎప్పటికప్పుడు మోనటరింగ్ చేపడతారని తెలిపారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అందరి సహకారం అవసరమన్నారు. ఈ సమావేశంలో ఏడీసీ విశ్వనాథ్, తహసీల్దార్ బంగార్రాజు, ఎన్నికల డీటీ కళ్యాణరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాగళం స్పందనతో తాడేపల్లి ప్యాలెస్‌లో ప్రకంపనలు

టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

గాజువాక, మార్చి 18: చిలకలూరిపేటలో జరిగిన ప్రజాగళం సభకు వచ్చిన స్పందన చూసి తాడేపల్లిలో ప్రకంపనలు మొదలయ్యాయని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. గాజువాకలోని పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు తెలుగుదేశం-జనసేన-బీజేపీ కూటమి విజయం కోసం ఎదురు చూస్తున్నారన్నారు. గాజువాకలో రానున్న రోజుల్లో మూడు పార్టీలతో కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, కార్పొరేటర్లు పల్లా శ్రీనివాస్, గంధం శ్రీనివాసరావు, బొండా జగన్, మొల్లి ముత్యాలనాయుడు, నాయకులు పుచ్చా విజయకుమార్, కోగంటి లెనిన్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

అగనంపూడి, మార్చి 18: జీవీఎంసీ 85వ వార్డు పరిధి ఫార్మాసిటీ పునరావాస కాలనీలో శ్రీవల్లీ హెల్త్ కేర్ ఆధ్వర్యంలో స్ఫూర్తి హెల్త్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసోసియేషన్ సౌజన్యంతో సోమవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన వచ్చింది. సుమారు వందమందికి వివిధ వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. తొలుత ఈ శిబిరాన్ని స్థానిక పెద్దలు పైడిరాజు, చినవెంకటరమణ ప్రారంభించారు. వైద్యులు జయసాయి చందు సుందరం, మల్లిక, ఆదిత్య, తదితరులు పాల్గొన్నారు.

28న ముత్యాలమ్మ పండుగ

వేపగుంట మార్చి 18: వేపగుంట, నాయుడుతోట పరిసర 14 గ్రామాల ఆరాధ్య దైవం వేపగుంట ముత్యాలమ్మ ప్రధాన పండుగను ఈ నెల 28న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ ఉత్సవాల్లో తొలిసారిగా భక్తులు అమ్మవారి మాలధారణ మంగళవారం నుంచి ప్రారంభిస్తారన్నారు.

శంకర్ ఫౌండేషన్ వ్యవస్థాపకునికి నివాళి



శంకరరావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కృష్ణకుమార్, తదితరులు

వేపగుంట మార్చి 18: నాయుడుతోట శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రి నిర్మాణ సారథి ఆత్మకూరు శంకరరావు 12వ వర్ధంతి సోమవారం నిర్వహించారు. ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న శంకరరావు విగ్రహానికి ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ, అతని కుమారుడు కృష్ణకుమార్ పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన తండ్రి ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఎందరో నిరుపేదలకు కంటి వైద్యమందించి వెలుగులు పంచారన్నారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని ఉద్యోగులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ ఆపరేషనల్ జీఎమ్ కె.రాధాకృష్ణన్, రమేష్, బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

'సమాంతర అభివృద్ధే టీడీపీ లక్ష్యం'

పెదగంట్యాడ, మార్చి 18: సంక్షేమం, అభివృద్ధి సమాంతరంగా నడపడమే టీడీపీ లక్ష్యమని జిల్లా అధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి అన్నారు. టీడీపీ సూపర్ సిక్స్ పథకాలపై సోమవారం నెల్లిముక్కు నిర్వాసిత కాలనీల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మేలో జరగనున్న ఎన్నిల్లో గాజువాక ఉమ్మడి అభ్యర్థి పల్లా శ్రీనివాసరావును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, టీడీపీ నాయకులు పి.సోమునాయుడు, ఎం.పెంటయ్య, మొల్లి రమణ, శ్రీరామరెడ్డి, కనకరాజు, అర్జున్, తదితరులు పాల్గొన్నారు.

బీహెచ్‌పీవీ హార్ట్‌ఫుల్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఏర్పాటు

అక్కిరెడ్డిపాలెం, మార్చి 18: బీహెచ్‌పీవీ కార్మికుల పిల్లలతో పాటు సంస్థకు చెందిన స్కూల్ పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేసిన బీహెచ్‌పీవీ హార్ట్‌ఫుల్ ఫ్రెండ్స్ అసోసియేషన్ లోగోను సీనియర్ కార్మికులు ఆవిష్కరించారు. సోమవారం భెల్ హెచ్‌పీవీపీ టౌన్‌షిప్‌లోని కమ్యూనిటీ హాల్‌లో జరిగిన అసోసియేషన్ ఆవిర్భావ కార్యక్రమంలో అసోసియేషన్ నూతన అధ్యక్షుడు జె.రామచంద్రరావు మాట్లాడుతూ టౌన్‌షిప్‌లో పుట్టి పెరిగిన కార్మికుల పిల్లలతో పాటు బీహెచ్‌పీవీ స్కూల్ పూర్వ విద్యార్థుల మధ్య స్నేహ బంధాన్ని పెంపొందించేందుకు కృషి చేయడమే తమ ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు ములక్ నానిబాబు, పసుపులేటి శ్రీనివాసులు, ఎం.రవిశంకర్, ఎంఎస్ కుమార్, పి.లక్ష్మీభవానీ, వై.రామకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు

కూర్మన్నపాలెం, మార్చి 18: జీవీఎంసీ 71వ వార్డు పరిధి శ్రీనగర్‌లో శ్రీకృష్ణ గోవర్ధనగిరి టెంపుల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం శ్రీవిజయగణపతి, రమా సత్యనారాయణస్వామి, శ్రీకృష్ణ గోవర్ధనగిరి ఆలయంలోని శ్రీకృష్ణునికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, సకల దేవతా మండపారాధన, కలశ స్థాపన, 108 కలశాలతో క్షీరాభిషేకం జరిపారు. సాయంత్రం హోమాలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు ఎ.సూర్యనారాయణ, కె.సహదేవుడు, బి.లక్ష్మణరాజు, శ్రీనివాసరాజు, పంచముఖేశ్వరరావు, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.





సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

స్టీల్‌ప్లాంట్‌పై మాట్లాడే అర్హత అమర్‌నాథ్‌కు లేదు

'ఉక్కు' పరిరక్షణ కాంగ్రెస్‌తోనే సాధ్యం

పార్టీ జిల్లా అధ్యక్షుడు గోవిందరాజు

గాజువాక, మార్చి 18: స్టీల్‌ప్లాంట్‌పై మాట్లాడే అర్హత మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు లేదని, ఉక్కు కర్మాగార పరిరక్షణ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గొంప గోవిందరాజు అన్నారు. గాజువాకలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌లో నిర్వహించిన సభ విజయవంతమైందని, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి హాజరై స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై స్పష్టంగా తమ అభిప్రాయాన్ని చెప్పారన్నారు. స్టీల్‌ప్లాంట్ విషయంలో వైసీపీ ప్రభుత్వం ఏమి చేసిందని ప్రశ్నించారు. ఈ సభకు ప్రజలు స్వచ్ఛందంగా వచ్చారన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి విజయాన్ని అందించాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ సీనియర్ నాయకుడు చెల్లుబోయిన నాయుడు, నాయకులు రాము, శ్రీనివాసరావు, రమణ, అచ్చిబాబు, అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

కాలువలో పడిపోయిన ఆవు



క్రేన్ సాయంతో ఆవును బయటకు తీస్తున్న దృశ్యం

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 18: స్టీల్‌ప్లాంట్ డబ్ల్యూఆర్ఎం విభాగం వద్దనున్న ఓ కాలువలో ఓ ఆవు పడిపోయింది. దీంతో పలువురు ఉద్యోగులు సీఐఎస్ఎఫ్ సిబ్బందికి సమాచారం అందించారు. ఈ మేరకు సిబ్బంది అక్కడకు చేరుకుని క్రేన్ సహాయంతో సుమారు రెండు గంటల పాటు శ్రమించి ఆవును బయటకు తీశారు. కాలువ మధ్యలో ఆవు పడిపోవడంతో దానికి తాళ్లు కట్టి బయటకు తీయాల్సి వచ్చింది.

నేడు పోలమాంబ జాతర



అగనంపూడి, మార్చి 18: జీవీఎంసీ 85వ వార్డు పరిధి ఫార్మాసిటీ పునరావాస కాలనీ ఈ-బోనంగి ప్రజల ఆరాధ్య దేవత పోలమాంబ జాతరను మంగళవారం నిర్వహిస్తున్నామని, ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఉదయం ఆరు గంటల నుంచే అమ్మవారి పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. రాత్రి ఏడు గంటల నుంచి పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయని పేర్కొన్నారు.

22 నుంచి ఉచిత సంగీత శిక్షణ

వెంకోజీపాలెం, మార్చి 18 : ఇసుకతోట కృష్ణ మందిరం పక్కనున్న విమల కృష్ణ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 22 నుంచి ఏప్రిల్ 22 వరకు జయదేవుని అష్టపదులు, సదాశివ బ్రహ్మేంద్ర కీర్తనలపై సంగీత ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ మండపాక శారద తెలిపారు. సోమవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు.వారానికి రెండు రోజుల పాటు తరగతులు ఉంటాయని, పూర్తి వివరాలకు 7993045466, 9000774695 ఫోన్ నంబర్లను సంప్రతించాలని ఆమె సూచించారు.

సినిమా గైడ్

- **భీమా :** మెలోడి, సంగం, శ్రీరామ, శారద, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక), నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్-2 (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), రాములమ్మ (తగరపువలస)
- **గామి :** జగదాంబ, శరత్, కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), గణేష్ (తగరపువలస), నటరాజ్ (పెందుర్తి), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం),
- **ప్రేమలు :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మి (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ఇంటి నెం.13 :** రమాదేవి, మోహిని (గాజువాక)
- **ఆపరేషన్ వాలెంటైన్ :** రమాదేవి, మౌర్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజవాక)
- **ఊరు పేరు భైరవకోన :** వెంకటేశ్వర, కామేశ్వరి, కన్య-2 (గాజువాక)
- **హనుమాన్ :** లీలామహల్, నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 20, టమాటా 15, వంకాయలు (తెలుపు) 24, వంకాయలు (నలుపు) 24, బెండకాయలు 24, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 34, బీరకాయలు 34, ఆనపకాయలు 14, కాలీఫ్లవర్ 20, క్యాబేజీ 22, క్యారెట్ 26, దొండకాయలు 20, బంగాళా దుంపలు 21, అరటి కాయ (పె)7, మునక్కాడలు (కిలో) 36, అల్లం (పాతది) 144, బరబాటి 16, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 110, గోరుచిక్కుడు 34, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 150, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 52, ఆగాకర 52, పొటల్స్ 80, కీరదోస 24, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 50, చిలగడదుంపలు 26, కంద 60, దేముడు చిక్కుడు 56, కొండఉసిరి 65, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 55, బూడిద గుమ్మడి కాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 35.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	430
విజయనగరం	434
శ్రీకాకుళం	434

చికెన్ ధరలు (బ్యాగ్)

రైతు ధర	--	90
ఫారం ధర	--	110
విత్ స్కిన్	--	190
స్కిన్‌లెస్	--	200

మరికొన్ని సిటీ వార్తలు | పేజీ Iలో..



పల్లా శ్రీనివాసరావుకు అభినందనలు తెలుపుతున్న కార్పొరేటర్లు

'పల్లా'కు కార్పొరేటర్ల అభినందనలు

గాజువాక, మార్చి 18: గాజువాక నియోజకవర్గం టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా పల్లా శ్రీనివాసరావుకు టికెట్ కేటాయించడంపై హర్షం వ్యక్తం చేస్తూ తెలుగుదేశం పార్టీకి చెందిన పలువురు కార్పొరేటర్లు సోమవారం ఇక్కడి 'దేశం' కార్యాలయంలో ఆయనను కలిసి అభినందనలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో విజయం పల్లా శ్రీనివాసరావు గెలుపు తథ్యమని, ఇందుకోసం తామంతా శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. ప్రజలంతా వైసీపీ ప్రభుత్వ అంతం కోసం ఎదురు చూస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, కార్పొరేటర్లు పల్లా శ్రీనివాసరావు, గంధం శ్రీనివాసరావు, బొండా జగన్, పులి లక్ష్మీబాయి, రౌతు శ్రీనివాసరావు, మొల్లి ముత్యాలనాయుడు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: గాజువాక ఉమ్మడి అభ్యర్థి పల్లా శ్రీనివాసరావుకు 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పలు కాలనీల నాయకులు అభినందనలు తెలిపారు. తామంతా పల్లా శ్రీనివాసరావు విజయానికి కృషి చేస్తామన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబును మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు అందరూ కృషి చేయవలసిందిగా వారిని పల్లా కోరారు. కార్యక్రమంలో నాయకులు బి.అప్పారావు, టి.సుదర్శన్, పి.ఉగ్రం, తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య సమస్యను అరికట్టాలని ధర్నా

గాజువాక, మార్చి 18: అదానీ గంగవరం పోర్టు కాలుష్యాన్ని అరికట్టాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకులు పాత గాజువాకలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ అదానీ పోర్టు వల్ల గాజువాక ప్రజలు కాలుష్యం కోరల్లో చిక్కుకుని విలవిల్లాడుతున్నారన్నారు. రహదారులపై నిత్యం వందలాది వాహనాలు కనీస నిబంధనలు పాటించకుండా వెళుతున్నాయని, వీటివల్ల చాలా ఇబ్బందులు వస్తున్నాయన్నారు. కాలుష్యం వల్ల పారిశ్రామిక ప్రాంత ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగిన చర్యలు చేపట్టకపోతే ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు లోకేశ్, రమణ, కిరీటం, సంతోషం, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరాజు, తదితరులు పాల్గొన్నారు.

అదీప్‌రాజ్‌కి ఇవే ఆఖరి ఎన్నికలు

పంచకర్లపై విమర్శలపై జనసేన నాయకులు మండిపాటు

పెందుర్తి, మార్చి 18: పెందుర్తి స్థానంనుంచి పోటీచేయాలంటే పాస్‌పోర్టు, వీసా ఉండాలా..? అని వైసీపీ అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌నుద్దేశించి జనసేన నాయకులు నిలదీశారు. పెందుర్తి నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి పంచకర్ల రమేశ్‌బాబు ఉద్దేశించి వలసవాది, స్థానికేతరుడు, పార్టీలు మారడమే ఎజెండా అంటూ ఇటీవలఅదీప్‌రాజ్ చేసిన వ్యాఖ్యలను వారు ఖండించారు. సోమవారం చినముషిడివాడలోని జనసేన పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈసందర్భంగా విశాఖ. అనకాపల్లి జి ల్లాల పార్టీ ప్రధాన కార్యదరులు ఆయితి సింహాచలం, ఇందల రమణ మాట్లాడుతూ 2009లో పెందుర్తిలో జరిగిన ముక్కోణ పోటీలో వైసీపీ, టీడీపీఉద్దండులను ఓడించి 16 రోజుల వ్యవధిలో పంచకర్ల ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారని గుర్తుచేశారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి రాజకీయ మచ్చ లేని పంచకర్లను విమర్శించే స్థాయి అదీప్‌రాజ్‌కు లేదన్నారు. సమావేశంలో జనసేన నాయకులు గండి దుర్గాప్రసాద్. పి.పార్వతి, డీబీఎల్‌నాయుడు కంచిపాటి మధు,సేనాపతి సోమశేఖర్, కోరుపోలు రామునాయుడు పాల్గొన్నారు.

ఎన్‌ఏడీలో పోలీసుల కవాతు



ఎన్ఏడీ ఫ్లైఓవర్‌పై కవాతు నిర్వహిస్తున్న పోలీసు బలగాలు

ఎన్ఏడీ జంక్షన్, మార్చి 18: ఎన్ఏడీ జంక్షన్ ఫ్లైఓవర్ నుంచి గోపాలపట్నం కూడలి వరకు పోలీసులు, ఆర్మీ సిబ్బంది ఎన్నికల నేపథ్యంలో ఆర్మీ జవానులు, పోలీసులు సోమవారం కవాతు నిర్వహించారు.ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతలకు ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేపడుతున్నామని క్రైమ్ డీసీపీ ఎం.సత్తిబాబు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఓటరు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్‌కుమార్, క్రైమ్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, సీఐలు, ఎస్ఐలు, పోలీసులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు అమలు



శిలాఫలకాలపై కాగితాలు అతికిస్తున్న సచివాలయ సిబ్బంది

గోపాలపట్నం, మార్చి 18: ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో కమిషన్ నిబంధనలు అమలుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రెండు రోజులుగా రాజకీయ పార్టీలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు తొలగిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థల్లో ఉన్న నాయకుల ఫొటోలను సోమవారం తొలగించారు. పలు ప్రాంతాల్లోని శిలఫలకాలపై పేర్లు కనిపించకుండా సచివాలయ సి బ్బంది కాగితాలను అతికిస్తున్నారు.

జగన్‌ను కలిసిన నాగిరెడ్డి, చందు

గాజువాక, మార్చి 18: ముఖ్యమంత్రి జగన్‌ను గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, ఆయన కుమారులు దేవన్‌రెడ్డి, వంశీరెడ్డితో పాటు మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డిలు సోమవారం కలిశారు. గాజువాక అసెంబ్లీ టికెట్‌ను తమకు కేటాయించాలని కోరారు. అదేవిధంగా వైసీపీ గాజువాక నియోజకవర్గ మాజీ సమన్వయకర్త ఉరుకూటి చందు కూడా తన తండ్రి ఉరుకూటి అప్పారావుతో కలిసి జగన్‌ను కలిశారు. చందుకు టిక్కెట్ కేటాయించినట్టు ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి వైవీ సుబ్బారెడ్డి కూడా బహిరంగ సభలో ప్రకటించడంతో తమకే టికెట్ వస్తుందని భావించిన క్రమంలో దానిని మార్చడంతో ఆవేదనకు గురయ్యామన్నారు. అందువల్ల తమకు తమకు టికెట్ కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

కార్మికులపై కక్ష సాధింపు తగదు

ఇంటక్ ఉక్కు ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్



..మాట్లాడుతున్న రాజశేఖర్

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 18: స్టీల్‌ప్లాంట్ కార్మికులపై యాజమాన్యం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని, ఇది మంచి పద్ధతి కాదని ఇంటక్ ఉక్కు ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ అన్నారు. ప్లాంట్‌లో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా కార్మికులను భయభ్రాంతులకు గురిచేసేలా యాజమాన్యం వ్యవహరిస్తుందని మండిపడ్డారు. ఉక్కు ఉత్పత్తికి కావాల్సిన వనరులను సమకూర్చాల్సిన యాజమాన్యం ఇవేమీ పట్టించుకోకుండా కార్మికులపై కక్ష సాధింపు చర్యలకు దిగుతుందన్నారు. కార్మిక సమస్యలు పరిష్కరించేంత వరకు పోరాటాలు తప్పవన్నారు. తృష్ణా మైదానంలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సభ సక్సెస్ అయిందని, ఇదే స్ఫూర్తితో ప్లాంట్‌ను కాపాడుకునేందుకు పోరాటాలు చేద్దామన్నారు. ఈ సమావేశంలో నాయకులు నీరుకొండ రామచంద్రరావు, కారు రమణ, కొవిరి అవతారం, డి.మోహన్, ఎంఎస్ఆర్ ప్రసాద్, కె.వెంకటరావు, నగేశ్, గోపి, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం పక్కనే సీఎం, వైసీపీ నేతల ఫ్లెక్సీ!



నరసింహనగర్ పార్కులో జగన్, నేత ఫ్లెక్సీ

అక్కయ్యపాలెం, మార్చి 18: ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిన నేపథ్యంలో రాజకీయ నాయకుల చిత్ర పటాలతో కూడిన బ్యానర్లు, పోస్టర్లు తొలగించాలి. కానీ, వాటిని సచివాలయ అధికారులు, జీవీఎంసీ సిబ్బంది తొలగించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. గ్రేటర్ 14వ వార్డు నరసింహనగర్ పార్కులో విద్యుత్ స్తంభానికి ఉన్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఫొటోతో పాటు వైసీపీ ఉత్తర నియోజకవర్గనేత చిత్రాన్ని తొలగించలేదు.సచివాలయానికి ఆనుకుని ఈ పార్కు ఉన్నా ఈ ఫ్లెక్సీ సిబ్బందికి కనిపించలేదా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. అలాగే, అక్కయ్యపాలెం పరిసరాల్లో పలుచోట్ల అధికార పార్టీకి చెందిన నాయకుల ఫ్లెక్సీ బ్యానర్లు చాలా దర్శనమిస్తున్నారు.

లేపాక్షి వద్ద పూడిక తొలగింపు



జేసీబీతో పూడికలు తొలగిస్తున్న దృశ్యం

జగదాంబ కూడలి, మార్చి 18: జగదాంబ దరి లేపాక్షి, వాచ్‌హౌస్ మెయిన్ రోడ్డు పై మురుగు నీటినుంచి విముక్తి లభించింది. సోమవారం లేపాక్షి, ఇండస్ వైపు రోడ్డు మీద కాలువల్లో వ్యర్థాలు, పూడికలను జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు పర్యవేక్షణలో తొలగించారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు లేపాక్షి దరి వద్ద కాలువలనుంచి మురుగునీరు రహదారిపైకి రావడంతో జనాలు ఇబ్బందులు పడ్డారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావడంతో చర్యలకు దిగారు. లక్ష్మీమాల్ వద్ద కాలువల్లో పూడికలను జేసీబీలతో తొలగించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, మార్చి 18: అక్కయ్యపాలెం సెక్షన్ పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్నందున మంగళవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ బి.సింహచలం నాయుడు తెలిపారు. గండిబాబ్జీ ఆఫీస్ ఏరియా, వినాయక ఆలయం సమీపం గ్రీన్‌పార్కు ఏరియాల్లో కరెంట్ సరఫరా ఉండదన్నారు.



అచ్చిబాబు కళ్యాణమండం వద్ద గ్రీన్ బెల్ట్ దుస్థితి



తెగిపడిన ఇనుప కంచె

మూణ్నాళ్ల ముచ్చటే...!

- గ్రీన్‌బెల్ట్ పార్కుల్లో నాణ్యతా లోపంతో పనులు
- విరిగిన సిమెంట్ బెంచీలు, బల్లలు
- చీకటి పడితే మందుబాబుల ఆగడాలతో బెంబేలు

కంచరపాలెం, మార్చి 18: జాతీయ రహదారి పొడవునా గ్రీన్ బెల్ట్‌లో సుందరీకరణ పేరిట ఇటీవల చేపట్టిన అభివృద్ధి పనులు మూణ్నాళ్ల ముచ్చటగా మారాయి. కొన్నిచోట్ల కూర్చునేందుకు వేసిన సిమెంట్ బెంచీలు విరిగిపోయాయి. మరికొన్నిచోట్ల పార్కులో వేసిన వాకింగ్ ట్రాక్‌లు గోతులతో నిండి ఉంటున్నాయి. గ్రీన్‌బెల్ట్‌లో పచ్చదనం పెంపొందించడంతోపాటు వాటిని పార్కులుగా అభివృద్ధి చేస్తే స్థానికులకు ఉపయోగకరంగా ఉంటుందన్న ఆలోచనతో ప్రభుత్వం కంచరపాలెం నుంచి ఎన్ఏడీ జంక్షన్ వరకు గల అనువైన ప్రదేశాల్లో లక్షలాది రూపాయలు వెచ్చించారు. అయితే, ఇలా ఈ పనులు నాణ్యతా లోపంతో చేపట్టడంతో మూడు నెలల గడవకముందే వృథాగా మారాయి. పలుచోట్ల పార్కుల్లో బెంచీలు, బల్లలు, చుట్టూ వేసిన ఇనుప కంచె శిథిలమైంది. కంచరపాలెం అచ్చిబాబు కల్యాణ మండపం సమీపంలో నిర్మించిన పార్కులో సేద తీరడానికి వేసిన సిమెంట్



విరిగిని సిమ్మెంట్ బెంచీ

బెంచీలు పగిలిపోవడంతో కూర్చోవడానికి అవకాశం లేకుండా పోతోంది. సమీపాన పార్కుల్లో పశువులను పెంచుతున్నారు. అదేవిధంగా ఇక్కడ సాయంత్రంచీకటిపడగానే ఆకతాయిలు ప్రవేశించి మద్యం సేవించడం, ఇతర అసాంఘిక కార్యకలాపాలు చేపడుతున్నారు. దీంతో పార్కులోకి రావడానికి స్థానికులతో పాటు మహిళలు భయపడుతున్నారు. దీంతో ప్రభుత్వం వీటిని ఏర్పాటు చేసిన లక్ష్యం నిర్వీర్యమవుతుందని పలువురు వాపోతున్నారు. ఇకనైనా అధికారులు చర్యలు చేపట్టి విరిగిపోయిన బెంచీల స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేయాలని, అదేవిధంగా మందుబాబుల చొరబడకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



పార్కులో మద్యం సీసాలు

ఆటోనగర్‌పై మాట తప్పిన ఎమ్మెల్యే వాసుపల్లి: సిటు



మాట్లాడుతున్న సిటు నాయకులు

జగదాంబ కూడలి, మార్చి 18: నగరంలో స్ర్కాప్ వర్కర్ల కోసం రాజన్న ఆటోనగర్ నిర్మించి అందిస్తామన్న దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌కుమార్ మాట తప్పారని సీఐటీయూ నాయకుడు వై. రాజు, స్ర్కాప్ వర్కర్ల సంఘం కార్యదర్శి గణేశ్ ఆరోపించారు. సోమవారం సీపీఎం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలోని స్ర్కాప్ వర్కర్ల షాపులను నగర శివారుకు తరలించాలనే ఆలోచనతో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఆనందపురం సమీపాన కణమాం గ్రామం వద్ద 157.7 ఎకరాలను కేటాయిందన్నారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం రాజన్న ఆటోనగర్ పేరిటఈ గ్రామంలో స్ర్కాప్‌వర్కర్లకు షాపులు నిర్మించి ఇస్తామని గొప్పలు చెప్పిందన్నారు. అయితే, నేటికీ రాజన్నఆటోనగర్ నిర్మాణం చేపట్టలేదన్నారు. వైసీపీ నేత వైవీ సుబ్బారావు ఆధ్వర్యంలో వన్‌టౌన్ మున్సిపల్ స్టేడియంలో భారీ సమావేశం ఏర్పాటు చేసి ఎమ్మెల్యే వాసుపల్లి దీనిపై ఇచ్చిన హామీ నేటికి నేరవవెర్చలేదని విమర్శించారు.

'కొప్పుల వెలమలకు న్యాయం చేయాలి'

డాబాగార్డెన్స్, మార్చి 18: అనకాపల్లి, విజయనగరం పార్లమెంట్ స్థానాలను కొప్పుల వెలమలకు ప్రధాన రాజకీయ పార్టీలు కేటాయించాలని కొప్పుల వెలమ రాష్ట్ర సంక్షేమ సంఘం అధ్యక్షుడు కిలపర్తి పరదేశీనాయుడు స్పష్టం చేశారు. సోమవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లోని సుమారు 28 లక్షల మంది, ఉత్తరాంధ్ర జిల్లాల్లోనే సుమారు 20 లక్షలపైగా కొప్పల వెలమ కులస్తులు ఉన్నట్టు వివరించారు. అనకాపల్లి పార్లమెంట్ పరిధిలో నర్సీపట్నం, పాయకరావుపేట, యలమంచలి, పెందుర్తి, చోడవరం, మాడుగుల నియోజకవర్గాలలో అత్యధికంగా తమ సామాజిక వర్గం ఉందన్నారు. రాష్ట్ర బీసీ కులాలలో రెండవ అతిపెద్ద కులం తమదన్నారు. విజయనగరం పార్లమెంట్ పరిధిలో ఒక్కటంటే ఒక్క అసెంబ్లీ టికెట్ కూడా కేటాయించకపోవడం అన్యాయమన్నారు. ఈ సమావేశంలో విజయనగరం అధ్యక్షులు బొత్స వరప్రసాద్, గౌరవాధ్యక్షులు శీర సత్యనారాయణ, అసోసియేటెడ్ అధ్యక్షులు దొగ్గ దేముడు, గుణుపూరు రామారావు, మేళాపు శ్రీహరినాయుడు పాల్గొన్నారు.

'అందరి సహకారంతో కాంగ్రెస్ సభ విజయవంతం'



మాట్లాడుతున్న పాశర్ల ప్రసాద్

సీతొపేట, మార్చి 18: కార్మికులు, ప్రజల సహకారంతో విశాఖలో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఇటీవల నిర్వహించిన సభ విజయవంతమైందని మాజీ సర్పంచ్, ఆ పార్టీ నాయకుడు పాశర్ల ప్రసాద్ తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల తాను టీడీపీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరన్నారు. బహిరంగ సభ వేదికగా కాంగ్రెస్ పార్టీ విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా డిక్లెరేషన్ ప్రకటించందన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్నట్టు పీసీసీ అధ్యక్షురాలు షర్మిల చెప్పారన్నారు. జగన్ ఆంధ్రప్రదేశ్‌ను అప్పుల ఊబిలోకి నెట్టేశారన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిల్ల పైడిరాజు, రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శివకుమార్ పాల్గొన్నారు.

ఏయూ హాస్టల్ వార్డెన్‌పై విచారణకు ఎస్సీ కమిషన్ ఆదేశం

విశాఖపట్నం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని ఓ వసతి గృహానికి వార్డెన్‌గా పనిచేస్తున్న అధికారిపై విచారణ చేసి నివేదిక అందించాలని జాతీయ ఎస్సీ కమిషన్ ఏయూ వైస్ చాన్సలర్, నగర పోలీస్ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు 11వ తేదీన ఎస్సీ కమిషన్ డైరెక్టర్ డాక్టర్ జి సునీల్ కుమార్ బాబు నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. ఏయూలో న్యాయ కళాశాలలో విద్యార్థిని వు మెన్స్ హాస్టల్‌లో ఉంటోంది. హాస్టల్ అధికారులు వెజ్ నుంచి నుంచి నాన్ వెజ్‌కు, నాన్ వెజ్ నుంచి వెజ్‌కు మారిన ప్రతిసారి హాస్టల్ అధికారులు అదనంగా ఫీజు వసూలు చేస్తున్నారు. నెల మొత్తం హాస్టల్ తెరిచి ఉన్నప్పుడు మాత్రమే పూర్తి ఫీజు వసూలు చేయాలి. సెలవులు ఉంటే ఆ మొత్తాన్ని కట్ చేసి విద్యార్థులు నుంచి ఫీజులు తీసుకోవాలి. కానీ, ఇక్కడి అధికారులు పూర్తి ఫీజును విద్యార్థులు నుంచి వసూలు చేస్తున్నారు. ఈ అంశాలపై దృష్టి సారించిన న్యాయ కళాశాల విద్యార్థిని.. సమాచార హక్కు చట్టం కింద గతేడాది అక్టోబరు మూడో తేదీన దరఖాస్తు చేశారు. దీనిపై సమాచారాన్ని అరకొర ఇవ్వడమే కాకుండా దరఖాస్తు వెనక్కి తీసుకోవాలంటూ సదరు వార్డెన్ విద్యార్థినిపై వేధింపులకు పాల్పడ్డారు. తోటి విద్యార్థుల ఎదుట ఆవిద్యార్థిని బెదిరించడంతోపాటు దుర్భాషలాడారు. దీంతో తీవ్రంగా మానసిక వేదనకు గురైన సదరు బాధిత విద్యార్థిని గతేడాది డిసెంబర్ 12న ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు.పరిగణలోకి తీసుకున్న ఎస్సీ కమిషన్ 30 రోజుల్లో విచారణ జరిపి నివేదిక అందించాలని ఆదేశించింది. దీనిపై ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జేమ్స్ స్టీఫెన్‌ను వివరణ కోరగా.. ఈ విషయం తన దృష్టికి రాలేదన్నారు.

కేన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలి



మందులు పంపిణీ చేస్తున్న టీడీపీ నేత శ్రీభరత్

పూర్ణామార్కెట్, మార్చి 18: కేన్సర్ వ్యాధిపై అప్ర మత్తంగా ఉండాలని టీడీపీ విశాఖ పార్లమెంట్ అభ్యర్థి భరత్ అన్నారు. సోమవారం గ్రేటర్ 39వ వార్డు కోటవీధి ఏరియాలో ని ఆంగ్లోఇండియన్ భవనంలో గీతం, బసవతారం ఇండో అమెరికన్ కేన్సర్ ఆసుపత్రులు సంయుక్త నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేన్సర్ వ్యాధి సోకిన వారు ఆధైర్య పడనవసర లేదని, చికిత్స ద్వారా నివారణ సాధ్యమన్నారు. బసవతారం కేన్సర్ టీమ్ వైద్యులు ఉచితంగా వైద్యపరీక్షలు చేసి వ్యాధి అనుమానిత కేసులను గుర్తించారు. ఉచితంగా రోగులకు వైద్యమందించనున్నారు. ఈకార్యక్రమంలో జనసేన దక్షిణ అభ్యర్థి వంశీ, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

'దక్షిణ' టికెట్ స్థానిక నేతలకే అవకాశమివ్వాలి'

డాబాగార్డెన్స్, మార్చి 18: దక్షిణ నియోజక వర్గ టికెట్ స్థానిక నేతలకే కేటాయించాలని నియోజకవర్గ నాయకులు డా.మూగి శ్రీనివాస్, కార్పొరేటర్ మహమ్మద్ సాధిక్ కోరారు. సోమవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. స్థానిక ప్రజల మనోభావాలను పరిగణలోకి తీసుకుని అభ్యర్థిని ప్రకటించాలన్నారు. గత 15 ఏళ్లగా ప్రజల్లో ఉన్న నాయకులకు టికెట్ వ్వాలన్నారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు మేడిశెట్టి రమణ, వెంకటరావు, దేముడు, రూప, తులసి, కనక మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'పారిశుధ్యంపై పాలకుల నిర్లక్ష్యం'

పూర్ణామార్కెట్, మార్చి 18: ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే కోటవీధి, ఫెర్రీరోడ్డు పరిసరాల్లో పారిశుద్య లోపం తాండవిస్తోందని టీడీపీ విశాఖ పార్లమెంట్ అభ్యర్థి శ్రీభరత్ ఆరోపించారు. సోమవారం గ్రేటర్ 39వ వార్డులో పర్యటించారు. ఈసందర్భంగా స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. లక్ష్మీటాకీస్ వద్ద కాలువ నిర్మాణంలో జాప్యం వల్ల ఫెర్రీ రోడ్డు వద్ద మురుగు నీటి నిల్వలతో స్థానికులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నట్టు పార్టీ శ్రేణులు ఆయన దృష్టికి తెచ్చాయి. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన ప్రజలకు హామీ ఇచ్చారు. టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోల్ బాల్ అసోసియేషన్ వార్షికోత్సవం



క్రీడాకారులను అభినందిస్తున్న వరప్రసాద్

మురళీనగర్, మార్చి 18; విశాఖ రోల్ అసోసియేషన్ మూడో వార్షికోత్సవాన్ని సోమవారం మురళీనగర్‌లో నిర్వహించారు. 50వవార్డులో వైశాఖీ స్పోర్ట్స్ పార్కు వేదికగా కొనసాగుతున్న ఈ అసోసియేషన్ మరింత ప్రగతి సాధించాలని ఈ సందర్భంగా స్పోర్ట్సు పార్కు అధ్యక్షులు సనపల.వరప్రసాద్ అన్నారు. పలువురు క్రీడాకారులకు మెమొంటోలు అందించారు. విశాఖ రోల్ బాల్ అసోసియేషన్ సెక్రటరీ తోట.లలిత ప్రియ, కోచ్ సంతోష్‌లను ఈసందర్భంగా అభినందించారు. అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరించారు. వైశాఖీ స్పోర్ట్సు సెక్రటరీ సూర్యనారాయణ ఉన్నారు.

ఎన్జీవో సేవలకు జీవీఎంసీ నిధులు!

... 5వ పేజీ తరువాయి

లక్షలు ఖర్చు చేశామని, ఆ మొత్తం చెల్లించాలంటూ జీవీఎంసీకి బిల్లు పెట్టారు. అలాగే ఆర్ట్ కాంపిటీషన్ సందర్భంగా రంగుల కొనుగోలు, ఆర్టిస్టులకు చెల్లించడానికి అయిన ఖర్చుల పేరుతో మరో రూ.రెండు లక్షలకు బిల్లు పెట్టినట్టు సమాచారం. స్వచ్ఛంద సేవలకు బిల్లు చెల్లించడం కుదరదని తనను కలిసిన ఎన్జీవో సంస్థ ప్రతినిధికి ఓ జూనియర్ అసిస్టెంట్ చెప్పగా...అందుకు అతను 'నేనెవరో మీకు తెలియదనుకుంటా...నా పెళ్లికి జీవీఎంసీ కమిషనర్ హాజరయ్యారు. నాకు జనవరి 26న అవార్డు కూడా ఇచ్చారు తెలుసా' అని హెచ్చరింపు ధోరణిలో మాట్లాడారు. అయినప్పటికీ బిల్లు కోసం ఫైలు పెట్టలేనని సదరు జూనియర్ అసిస్టెంట్ తెగేసి చెప్పినట్టు తెలిసింది.

అధికారి నిర్వాకంతోనే...

దీంతో ఆ ఎన్జీవో ప్రతినిధి నేరుగా జీవీఎంసీలోని ఉన్నతాధికారిని కలిసి జూనియర్ అసిస్టెంట్‌పై ఫిర్యాదు చేశారు. దీంతో ఆ అధికారి వెనుకాముందు ఆలోచించకుండా జూనియర్ అసిస్టెంట్‌కు ఫోన్ చేసి చెడామడా వాయించేసినట్టు సమాచారం. రూల్స్ గురించి మాట్లాడకుండా బిల్లు సిద్ధం చేయాలని ఆదేశించడంతో జూనియర్ అసిస్టెంట్ తనకెందుకొచ్చిందని పని చేసేశారు. ఈ ఫైలు ప్రస్తుతం కమిషనర్ వద్ద పెండింగ్‌లో ఉన్నట్టు సమాచారం. కాగా స్వచ్ఛంద సేవకు కూడా ప్రజా ధనం చెల్లించడం ఏమిటంటూ జీవీఎంసీలోని కొంతమంది అధికారులే ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

అధిష్ఠానం ఆదేశాలను పాటించాలి

- జనసేన పార్టీ ఉత్తర ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్



మాట్లాడుతున్న ఉషాకిరణ్

సీతమ్మధార, మార్చి 18: అధిష్ఠానం ఆదేశాల మేరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు నడుచుకోవాలని జనసేన ఉత్తర నియోజకవర్గ ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్ అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో నాయకులు, వార్డు అధ్యక్షులతో ఉషాకిరణ్ చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఉత్తర నియోజకవర్గంలో అభ్యర్థుల గెలుపు కాపులు నిర్దేశించిన స్థాయిలో ఉన్నారని అభి ప్రాయం వ్యక్తంచేశారు. 2009 ఎన్నికల్లో కూడా ప్రజారాజ్యం పార్టీ అతి తక్కువ ఓట్లతో గెలుపునకు దూ రమైనట్టు చెప్పారు. పార్టీ పిలుపు మేరకు నిత్యావసర వస్తువుల ధర, ఆర్‌సీ, విద్యుత్ చార్జీలు పెంపునకు నిరసనగా బాదుడే బాదుడూ తదితర కార్యక్రమాలు విజయవంతం చేసినట్టు పలువురు నాయకులు,కార్యకర్తలు వివరించారు. పవన్‌కల్యాణ్ నియోజకవర్గం సీటును జనసేన పార్టీకే కేటాయిస్తే అత్యధిక మెజారిటితో గెలిపిస్తామని వెల్లడించారు. నాయకులు నీరుకొండ దివాకర్, టి.శ్రీధర్, ముమ్మిన నాగమణి, పడాల పరమేశ్వరరావు, అల్లి మురళి, భాస్కర్, మాణిక్యాలరావు, శివ సతీష్, గారపాటి లక్ష్మి, పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు పటిష్ట చర్యలు

విశాఖపట్నం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించడానికి పటిష్ట చర్యలు చేపట్టాలని, ప్రతి అంశంపై అవగాహన కల్పించుకుని విధులు నిర్వహించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టరు ఎ. మల్లికార్జున అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన కలె క్టరేట్‌లో ఏర్పాటు చేసిన మానటరింగ్ కేంద్రాలను పరిశీ లించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రాల్లో నిర్వహించాల్సిన విధులు, బాధ్యతలు, నిబంధనలు తెలుసుకోవాల న్నారు. అనంతరం కమాండ్ కంట్రోల్‌రూమ్, వెబ్ కాస్టింగ్ రూమ్, కాల్ సెంటర్ పరిశీలించారు.ఈసందర్భంగా కంట్రోల్ రూమ్‌ను కలెక్టర్ ప్రారంభించారు. ఎన్నికల కోడ్ ముగిసే వరకు కంట్రోల్‌రూమ్ సేవలు అందిస్తోందని తెలిపారు.

రామ్‌నగర్‌లో వెలగపూడి విస్తృత ప్రచారం



రామ్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న వెలగపూడి తదితరులు

రామ్‌నగర్, మార్చి 18: తూర్పు నియోజకవర్గ పరిధి 28వ వార్డు రామ్‌నగర్‌లో శాసనసభ్యుడు వెలగపూడి రామకృష్ణ ఆధ్వర్యంలో బీజేపీ, జనసేన, టీడీపీ శ్రేణులు సోమవారం ప్రచారం చేశాయి. రామకృష్ణ.. బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ, సూపర్ సిక్స్ మహాశక్తి పథకాలను ఇంటింటికి వెళ్లి వివరించారు. ఈసందర్భంగా స్థానికులు వెలగపూడికి ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి నక్కా కనకరాజు, నాయకులు బొట్టా వెంకటరమణ, పోతన రెడ్డి,మద్దిల రాజశేఖర్, నక్కా అన్నపూర్ణ, పల్లా ఉమారాణి, జగన్నాథం, నకెళ్ల త్రినాద్,కళ్యాణి, నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున్న పాల్గొన్నారు.

వైసీపీపై యాదవుల గుస్సా

... 5వ పేజీ తరువాయి

చట్టసభల్లో ప్రాతినిధ్యం లేకుండా చేస్తే వారి పని కూడా చూడాల్సి ఉంటుందని పరోక్షంగా హెచ్చరించినట్టు తెలిసింది. దీంతో యాదవ సామాజిక వర్గానికి చెందిన వైసీపీ కార్పొరేటర్లు, తూర్పు నియోజకవర్గంలో కీలకంగా వ్యవహరిస్తున్న అదే సామాజిక వర్గానికి చెందిన నేత ఇటీవల పార్టీ ప్రాంతీయ సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డిని కలిసి తమ పరిస్థితి వివరించినట్టు తెలిసింది. ఎలాగైనా జిల్లాలో ఏదో ఒక సీటును తమ సామాజిక వర్గానికి కేటాయించాలని, లేనిపక్షంలో తాము రాజకీయంగా భవిష్యత్తు కోల్పోవడంతోపాటు పార్టీకి కూడా వచ్చే ఎన్నికల్లో ఇబ్బందులు తప్పకపోవచ్చునని వివరించినట్టు తెలిసింది. అభ్యర్థుల ప్రకటన జరిగిపోయినందున సీటు మార్చాలంటే తన చేతిలో లేదని, పార్టీ అధ్యక్షుడి దృష్టికి తీసుకువెళతానని సుబ్బారెడ్డి వారికి హామీ ఇచ్చినట్టు సమాచారం. గాజువాక నియోజకవర్గ సమన్వయకర్తగా వారం రోజుల కిందటి వరకూ యాదవ సామాజిక వర్గానికే చెందిన చందూ సమన్వయకర్తగా వ్యవహరించారని, ఆ సీటును ఇప్పుడు మార్చడం వల్ల ఎలాంటి ఇబ్బంది ఉండదని సుబ్బారెడ్డిని కలిసిన నేతలు వివరించగా, ఆ ప్రతిపాదనను కూడా సీఎందృష్టికి తీసుకువెళతానని ఆయన చెప్పినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలోవైసీపీ అధిష్ఠానం ఏ నిర్ణయం తీసుకుంటుందో చూడాలి. యాదవ సామాజిక వర్గాన్ని పక్కనపెట్టినట్టయితే జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో ప్రభావం పడే అవకాశం ఉందని ఆ పార్టీలో ఉన్న నేతలే ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

దక్కని దీవెన

... 5వ పేజీ తరువాయి

ఒకటో తేదీన విడుదల చేసింది. ఫైనల్ ఇయర్ చదువుతున్న ఒక విద్యార్థి, తల్లి ఉమ్మడి ఖాతాలో కిందట రూ.16,925 జమ అయింది. ఈ మొత్తాన్ని చెల్లించేందుకు వెళ్లిన సదరు విద్యార్థికి... మిగిలిన మూడు విడతల ఫీజు కలిపి చెల్లించాలంటూ కాలేజీ యాజమాన్యం స్పష్టంచేసింది. లేదంటే హాల్ టికెట్ ఇచ్చేది లేదని తేల్చిచెప్పింది. చేసేదేమీ లేక మొత్తం ఫీజు చెల్లించాడు. ఇలా...ఒక్కో విద్యార్థిపై కాలేజీని బట్టి కనీసం రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు భారం పడనున్నది. యాజమాన్యాల ఒత్తిడి భరించలేక ఇంజనీరింగ్, డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థుల్లో దాదాపు 50 శాతం మంది ఫీజులను చెల్లించేశారు. కొన్ని యాజమాన్యాలు ఫీజులు చెల్లించేంత వరకూ కాలేజీలకు రావద్దని బహిరంగంగానే చెబుతున్నాయి. ఉన్నతాధికారులు కూడా పట్టించుకోకపోవడంతో ఎవరికి చెప్పుకోవాలో కూడా అర్థం కావడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇదిలావుండగా కొంతమందికి తొలి విడత సొమ్ము కూడా ఇంకా జమ కాలేదు. 20 శాతం మంది విద్యార్థులకు అందాల్సి ఉందని చెబుతున్నారు.

'వసతి దీవెన' నిల్

స్కాలర్‌షిప్ మొత్తాన్ని రెండు విడతల్లో జగనన్న వసతి దీవెన కింద చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఒక్కో విడత పది వేలు చొప్పున రూ.20 వేలు చెల్లించాల్సి ఉంది. అయితే, 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇప్పటివరకూ ఒక్క విడత కూడా వసతి దీవెన మొత్తాన్ని ప్రభుత్వం జమ చేయలేదు. ఇంకా చెప్పాలంటే...గడిచిన విద్యా సంవత్సరానికి సంబంధించి వందలాది మందికి వసతి దీవెన నిధులు అందలేదు. అధికారులను అడుగుతున్నా స్పందన లేదని పలువురు చెబుతున్నారు. స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో గతంలో విధానాలను అమలు చేయాలని విద్యార్థులు చెబుతున్నారు.

ఖర్చులు తగ్గించండి, ఉత్పత్తి పెంచండి

... 5వ పేజీ తరువాయి

ఇతర ముడి పదార్థాలకు కూడా ఢిల్లీ వైపు చూడవద్దన్నారు. ప్లాంటును నడపడానికి అవసరమైనవన్నీ యాజమాన్యమే సమకూర్చుకోవాలన్నారు. ఖర్చులు తగ్గించుకోవాలని, ఉత్పత్తిని పెంచాలని, లాభాలు తీసుకురావాలని ఉద్బోధించారు. ప్లాంటు ఖర్చులుపోను ఏమైనా మిగిలితేనే జీతాల పెంపు (పే రివిజన్), పదోన్నతులు, పెన్షన్ల చెల్లింపు, గ్రాట్యుటీ వంటివి వస్తాయని వివరించారు. ఏ ఒక్కరు కూడా సాయం చేయరని, ఎవరి కష్టం వారిదేనని చాలా క్లియర్‌గా వెల్లడించారు. ప్లాంటుకు నష్టాలు వస్తే అంతిమంగా నష్టపోయేది ఉద్యోగులు, కార్మికులేనని హెచ్చరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు 2021లో లాభాలు వచ్చాయని, మరి అప్పుడు పే రివిజన్ చేయలేదని గుర్తుచేయగా, జరిగిపోయిందేదో జరిగిపోయిందని, ఇకపై జరగాల్సింది చూసుకోవాలని, అంతా సమష్టిగా పనిచేసి లాభాల బాటలోకి తేవాలని సూచించారు.

బయోమెట్రిక్‌పై తగ్గిన వ్యతిరేకత: ఈ నెల 8వ తేదీ నుంచి ప్లాంటులో ప్రతి ఒక్కరూ బయోమెట్రిక్ వేయాలని స్పష్టం చేసిన యాజమాన్యం అందుకు తగిన ఏర్పాట్లు చేసింది. అయితే కార్మిక సంఘ నాయకులు తమకు పే రివిజన్ చేయడంతో పాటు కొన్ని మౌలిక వసతులు కల్పించాలని, వాటిని నెరవేరిస్తేనే బయోమెట్రిక్ వేస్తామని వ్యతిరేకించిన సంగతి తెలిసిందే. బయోమెట్రిక్ వేయకపోతే రిజిస్టర్‌లో సంతకాలు చేయడానికి వీల్లేదని నిబంధన పెట్టడంతో సోమవారం అత్యధిక శాతం కార్మికులు వేలిముద్రలు వేసి విధులకు హాజరయ్యారు.

సర్టిఫికెట్ల కోసం పాట్లు

... 5వ పేజీ తరువాయి

దరఖాస్తుతో పాటు జత చేస్తే...ఆయా విభాగాల కింద విద్యార్థులకు రిజర్వేషన్ కల్పించి, సీట్లు కేటాయిస్తారు. ఈ ప్రాసెస్ అంతా పూర్తి కావడానికి వారం నుంచి పది రోజులు పడుతుంది. సచివాలయంలో ముందు దరఖాస్తు చేయాలి. ఎప్పటిలాగే అంతా సచివాలయాలకు వెళుతుంటే...అక్కడి సిబ్బంది వాటిని తీసుకోవడం లేదు. ఎన్నికల కోడ్ అమలులో ఉందని, సర్టిఫికెట్లు జారీ కావని చెప్పి తిరస్కరిస్తున్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిశాకే జూన్ రెండో వారంలో రావాలని చెబుతున్నారు. దాంతో తల్లిదండ్రులు లబోదిబోమంటున్నారు. జూన్‌లో ఏకంగా విద్యాలయాల్లో తరగతులు మొదలవుతాయని, అప్పుడు ఇస్తామంటే ఎలాగని వాపోతున్నారు. ఎన్నికలకు, సర్టిఫికెట్లకు సంబంధం ఏమిటని తెలియనవారు ప్రశ్నిస్తే...వాటిపై సీఎం బొమ్మ ఉంటుందని, అందుకే ఎన్నికల సంఘం వద్దని చెప్పిందని సమాధానమిస్తున్నారు. దాంతో ప్రజలు ఆగ్రహావేశాలు వ్యక్తంచేస్తున్నారు. పిల్లలకు ఇచ్చే సర్టిఫికెట్లు, పది కాలాలు భద్రపరుచుకునే పత్రాలపై నాయకుల బొమ్మలు ఎలా వేస్తారని, దానికి ఎవరు అనుమతి ఇచ్చారని ప్రశ్నిస్తున్నారు. గతంలో ఎప్పుడూ ఇలా లేదని, ఈ ప్రభుత్వం వచ్చాకే ఇలాంటి పనులు చేస్తున్నారని, ఇప్పుడు తమకు నెలాఖరులోగా సర్టిఫికెట్లు కావాలని, ఇవ్వకపోతే ఆందోళనకు దిగుతామని హెచ్చరించి వెళుతున్నారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలిగా...?: ప్రభుత్వ నిర్ణయాల వల్ల విద్యార్థులు, తల్లిదండ్రులు నష్టపోకుండా జిల్లా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. సీఎం, ఇతర నాయకుల బొమ్మలు ఏమీ లేకుండా ధ్రువపత్రాలు జారీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ సమస్యను ఎన్నికల సంఘానికి నివేదించి, తగిన పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

ఎన్నికల కోడ్ అమలుకు ప్రత్యేక విభాగాలు

... 5వ పేజీ తరువాయి

కథనాలను ఎప్పటికప్పుడు నమోదు చేయడానికి సోషల్ మీడియా సెల్‌ను ఏర్పాటుచేశారు. కొత్తగా ఎన్నికల సంఘం అందుబాటులోకి తెచ్చిన సీ.విజిల్ యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించడానికి మరొక సెల్‌ను ఏర్పాటుచేసి జీవీఎంసీ సిబ్బందిని నియమించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు కోసం జీవీఎంసీ కమిషనర్ సారథ్యంలో ఒక కమిటీ పనిచేస్తోంది. కాగా జాయింట్ కలెక్టర్ మయూర అశోక్ విశాఖ తూర్పు నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి కావడంతో నామినేషన్లు పరిశీలించేందుకు జేసీ ఛాంబర్ పక్కన ఒక సెల్ ఏర్పాటుచేశారు. ఇదిలావుండగా షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఎన్నికల విధుల నిర్వహణకు సంబంధించి అధికారులతో కలెక్టర్ మల్లికార్జున, జేసీలు ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నారు. రెవెన్యూతోపాటు పలు శాఖల అధికారులకు ఎన్నికల విధులు అప్పగించారు.

అలసత్వం ఎందుకు ?



క్యాంప్ కార్యాలయం వద్ద జగన్ కటౌట్

ఆరిలోవ, మార్చి 18 : ఆరిలోవలో మేయర్ గొలగాని హరి వెంకటకుమారి క్యాంపు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సీఎం జగన్ కటౌట్‌తో పాటు హోర్డింగులను తొలగించడంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పుడు రాజకీయ నాయకుల ఫొటోలతో ఉన్న బోర్డులు, హోర్డింగులను తప్పనిసరిగా తొలగించాలి. ప్రతిపక్ష పార్టీల నేతల కటౌట్లు, బోర్డులు, హోర్డింగులను తొలగిస్తున్న అధికారులు వైసీపీ హోర్డింగులు, బోర్డుల తొలగింపులో మాత్రం అలసత్వం వహిస్తున్నారు. దీనిపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

సిద్ధం హోర్డింగులు తొలగింపు

కొమ్మాది, మార్చి 18 : కొమ్మాది బస్టాప్‌పై ఉన్న సిద్ధం హోర్డింగులను అధికారులు తొలగించారు. ఎన్నికల నిబంధనల మేరకు కొమ్మాది బస్టాప్‌తో పాటు జాతీయ రహదారి పరిధిలో పలుచోట్ల భవనాలపై ఉన్న సిద్ధం హోర్డింగులు, ఫ్లెక్సీలను అధికారులు తొలగించకపోవడంపై 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం కథనం వచ్చిన విషయం తెలిసిందే. ఈమేరకు స్పందించిన అధికారులు వాటిని ఆఘమేఘాల మీద తొలగించి తెల్లరంగు వేశారు. అలాగే జాతీయ రహదారిలోని హోర్డింగులను కూడా తీసివేశారు. జోన్-2 కార్యాలయంలో జగన్ చిత్రపటంతో పాటు వైసీపీ ప్రచారానికి సంబంధించిన పోస్టర్లను తొలగించారు.

27న నూకాలమ్మ దేవర ఉత్సవం

భీమునిపట్నం, మార్చి 18 : పట్టణ ప్రజల గ్రామ దేవత నూకాలమ్మ దేవర ఉత్సవం (చాటింపు) ఈనెల 27న జరగనున్నట్టు ఆలయ వంశపారంపర్య పూజారులు చౌదరి సత్యరాజ్, వెంకటేష్ తెలిపారు. సోమవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. 27న అర్ధరాత్రి దాటిన తర్వాత అమ్మవారి ప్రతిరూపమైన తంగేటి పూలగరగను ఆలయం నుంచి డప్పు వాయిద్యాలు, నేలవేషాల నడుమ నూకాలమ్మ వీధి, శ్రీలక్ష్మీ నృసింహస్వామివారి వీధి, బ్రాహ్మణవీధి, శివాలయం వీధుల మీదుగా అమ్మవారి చదురు పట్టుకు తీసుకువస్తారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గిడుతూరి డెక్కన్ శ్రీనివాసరావు, కమిటీ నాయకులు పీరుపిల్లి రాజు, రాకోతు నరసింగరావు, నాగిరెడ్డి వెంకట స్వామి, అప్పికొండ బాలకృష్ణ ఆధ్వర్యంలో ఈ ఉత్సవం జరుగుతుందన్నారు.

అప్పన్నకు వైభవంగా నిత్య కల్యాణం



సింహాచలం, మార్చి 18 : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా సోమవారం నిత్య కల్యాణం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో శోభాయమానంగా స్వర్ణాభరణాలతో అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ప్రత్యక్షంగా పాల్గొన్న భక్తుల గోత్ర నామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

22 నుంచి ఉచిత సంగీత శిక్షణ

వెంకోజీపాలెం, మార్చి 18 : ఇసుకతోట కృష్ణ మందిరం పక్కనున్న విమల కృష్ణ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 22 నుంచి ఏప్రిల్ 22 వరకు జయదేవుని అష్టపదులు, సదాశివ బ్రహ్మేంద్ర కీర్తనలపై సంగీత ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించను న్నట్టు అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ మండపాక శారద తెలిపారు. సోమవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు.వారానికి రెండు రోజుల పాటు తరగతులు ఉంటాయని, పూర్తి వివరాలకు 7993045466, 9000774695 ఫోన్ నంబర్లను సంప్రతించాలని ఆమె సూచించారు.

సినిమా గైడ్

- **భీమా :** మెలోడి, సంగం, శ్రీరామ, శారద, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక), నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్-2 (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), రాములమ్మ (తగరపువలస)
- **గామి :** జగదాంబ, శరత్, కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), గణేష్ (తగరపువలస), నటరాజ్ (పెందుర్తి), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం),
- **ప్రేమలు :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మి (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ఇంటి నెం.13 :** రమాదేవి, మోహిని (గాజువాక)
- **ఆపరేషన్ వాలెంటైన్ :** రమాదేవి, మౌర్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజవాక)
- **ఊరు పేరు భైరవకోన :** వెంకటేశ్వర, కామేశ్వరి, కన్య-2 (గాజువాక)
- **హనుమాన్ :** లీలామహల్, నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 20,టమాటా 15, వంకాయలు (తెలుపు) 24, వంకాయలు (నలుపు) 24, బెండకాయలు 24, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 34, బీరకాయలు 34, ఆనపకాయలు 14, కాలీఫ్లవర్ 20, క్యాబేజ్ 22, క్యారెట్ 26, దొండకాయలు 20, బంగాళా దుంపలు 21, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 36, అల్లం (పాతది) 144, బరబటి 16, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 110, గోరుచిక్కుడు 34, దోస కాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 150, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 52, ఆగాకర 52, పొటల్స్ 80, కీరదోస 24, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 50, చిలగడదుంపలు 26 , కంద 60, దేముడు చిక్కుడు 56, కొండఉసిరి 65, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 55, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 35.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	430
విజయనగరం	434
శ్రీకాకుళం	434

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	-- 90
ఫారం ధర	-- 110
విత్ స్కిన్	-- 190
స్కిన్‌లెస్	-- 200

మరికొన్ని సిటీ వార్తలు పేజీ I లో..

ముందుకు కదలని నడక వంతెన పనులు

- ఆర్భాటంగా శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే ముత్తంశెట్టి
- రెండు నెలల్లో నిర్మిస్తామని హామీ
- ఇప్పటికీ ప్రారంభం కాని నిర్మాణం



గోతులు తవ్వడానికి అడ్డంగా వేసిన రేకులు

మధురవాడ, మార్చి 18 : చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ రహదారి దాటడానికి ప్రతిపాదించిన నడక వంతెన పనులు రేకులకే పరిమితమయ్యాయి. విద్యార్థులు జాతీయ రహదారి దాటడానికి సౌలభ్యంగా ఉండడానికి జీవీఎంసీ రూ.2.5 కోట్ల అంచనా వ్యయంతో నడక వంతెన నిర్మాణానికి చర్యలు చేపట్టింది. ఈమేరకు ఈఏడాది జనవరి 12న చంద్రంపాలెం ఉన్నత పాఠశాల వద్ద ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వైసీపీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి, తదితరులు శంకుస్థాపన చేశారు. పనులు చేపట్టిన ఒక ప్రైవేటు కంపెనీ రెండు నెలల్లో నిర్మాణం పూర్తి చేస్తామని అప్పట్లో ప్రకటించారు.తరువాత గత నెలలో పిల్లర్లు వేయడానికి, గోతులు తవ్వడానికి అడ్డంగా రేకులు ఏర్పాటు చేశారు. అనంతరం ఎక్కడి పనులు అక్కడే నిలిపివేశారు. దీంతో పాఠశాలకు వచ్చే సుమారు నాలుగు వేల మంది విద్యార్థులకు ఇక్కట్లు తప్పడం లేదు. ఎప్పటిలాగే కొందరు విద్యార్థులు జాతీయ రహదారి దాటడానికి రోడ్డు మధ్యలో వేసిన రెయిలింగ్ పైకెక్కి దాటుతున్నారు. ఇది కూడా ప్రమాదాల హేతువేనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పదో తరగతి పరీక్షా కేంద్రంగా ఈ పాఠశాలను కేటాయించడంతో విద్యార్థులకు మరిన్ని కష్టాలు ఎదురయ్యాయి. పాలకులు, అధికారులు స్పందించి వంతెన పనులు ప్రారంభమయ్యేలా చూడాలని పలువురు కోరుతున్నారు.



తోటగరువు హైస్కూలు వద్ద విద్యార్థుల సందడి



పద్మనాభం పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు

భీమునిపట్నం / భీమునిపట్నం (రూరల్), మార్చి 18 : తూర్పు, భీమిలి నియోజకవర్గాల్లో సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. భీమిలి మండలంలో 13 కేంద్రాలను ఏర్పాటు చేశారు. పది ప్రభుత్వ, మూడు ప్రైవేటు పాఠశాలల్లో పరీక్షలు నిర్వహించారు. అన్నిచోట్లా తాగునీరు, మెడికల్ కిట్లు వంటి సదుపాయాలు కల్పించారు. మొత్తం 2609 మంది పరీక్షకు హాజరయ్యారు. అన్ని కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈసారి ప్రతి మూడు రోజులకు ఒకసారి ఇన్విజిలేటర్లను మార్చు చేస్తున్నారు. అలాగే భీమిలిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సెయింట్ ఆన్స్ ఎయిడెడ్ హైస్కూల్‌లో మధ్యాహ్నం 2 నుంచి ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ పరీక్షలు కూడా ప్రారంభమయ్యాయి. టెన్త్ పరీక్షలకు 170, ఇంటర్ పరీక్షలకు 247 మంది హాజరయ్యారు.

ఆనందపురం : ఆనందపురం హైస్కూల్లో 1, 2, శొంఠ్యాం,బోయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పెద్దిపాలెం నారాయణ హైస్కూల్‌లో పరీక్షలు జరిగాయి. మొత్తం 1058 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు.

ఆరిలోవ : ఆరిలోవ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఎనిమిది కేంద్రాల్లో పరీక్షలు జరిగాయని అధికారులు తెలిపారు. విద్యార్థులు ఉదయం 8 గంటలకే కేంద్రాల వద్దకు చేరుకున్నారు. అధికారులు 9 గంటల తరువాత వారిని తరగతి గదుల్లోకి అనుమతించారు.

పెదవాల్తేరు : ఈస్టుపాయింట్ కాలనీలోని కేడీపీఎం హైస్కూల్‌లో 191 మందికి 182 మంది పరీక్షకు హాజరయ్యారు. అంధ బాలికలు 8 మందికి సహాయకులను ఏర్పాటు చేశారు.అలాగే 16 మంది మూగ, చెవిటి విద్యార్థులు కూడా పరీక్షలకు హాజరయ్యారు.

పద్మనాభం : మండలంలో నాలుగు కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు జరిగాయి. 15 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 701 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. మొత్తం 702 మంది హాజరు కావాల్సి ఉండగా రేవిడి కేంద్రంలో ఒక్క విద్యార్థి మాత్రమే గైర్హాజరయ్యారు. పరీక్ష సమయానికి అర్ధ గంట ముందు స్థానిక పోలీసు స్టేషన్‌లో భద్రపరిచిన ప్రశ్నపత్రాలను పరీక్ష కేంద్రాల చీఫ్‌లు, డిపార్ట్‌మెంటు అధికారులు కేంద్రాలకు తీసుకువచ్చారు. ప్రతి కేంద్రంలోనూ అత్యవసర పరిస్థితుల్లో వైద్యం అందించడానికి శిబిరాలను ఏర్పాటు చేశారు.అలాగే 144 సెక్షన్ విధించారు. అబ్జర్వరుగా వచ్చిన భీమిలి డైట్ కళాశాల లెక్చరర్ మాణిక్యం నాయుడు రెడ్డిపల్లి, పద్మనాభం కేంద్రాలను పరిశీలించారు. కాగా పద్మనాభం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఓపెన్ స్కూల్ పరీక్ష కేంద్రంలో 149 మంది పరీక్షలకు హాజరయ్యారు. ఈ కేంద్రానికి 176 మందిని కేటాయించగా తొలిరోజు నిర్వహించిన తెలుగు పరీక్షకు 163 మందికి 14 మంది గైర్హాజరయ్యారు. జిల్లా పరిశీలకులు ఇమంది పైడిరాజు కేంద్రాన్ని పరిశీలించారు.

'కూటమితోనే రాష్ట్రానికి భవిష్యత్తు'

మద్దిలపాలెం, మార్చి 18 : తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటుతోనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని జనసేన అర్బన్ జిల్లా అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. సోమవారం శివాజీపాలెంలోని క్యాంపు కార్యాలయంలో దక్షిణ నియోజకవర్గానికి చెందిన పలు సంఘాల నాయకులు ఆయన సమక్షంలో జనసేనలో చేరారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ మాట్లాడుతూ వైసీపీ నుంచి ప్రజలకు విముక్తి కలిగించడానికే టీడీపీ, జనసేన, బీజేపీ ఏకమై పోటీ చేస్తున్నాయన్నారు. ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థులకు గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొప్పుల భాస్కర్, సూరాడ రాజ్‌కుమార్, జనసేన దక్షిణ ఇన్‌చార్జి శివప్రసాదరెడ్డి, నాయకులు పి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే గంటాకు కరపత్రం అందిస్తున్న చోడె పట్టాభిరామ్



వంశీకృష్ణ సమక్షంలో జనసేనలో చేరిన నాయకులు

ఎంవీపీ కాలనీలో టీడీపీ ప్రచారం

ఎంవీపీ కాలనీ, మార్చి 18 : తెలుగుదేశం పార్టీ కార్యకర్తల్లో ఉత్సాహం పుంజుకుంది. ప్రచారంలో కార్యకర్తలు చురుగ్గా పాల్గొంటున్నారు. పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చోడె పట్టాభిరాం ఆధ్వర్యంలో నాయకులు ఉత్తర ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఇంటి వద్దకు వెళ్లారు. అక్కడ గంటాను కలిశారు. తెదేపా కరపత్రాన్ని ఆయకు కూడా అందించారు. అనంతరం పరిసర ప్రాంతాల్లో ప్రచారం చేస్తూ... ఎమ్మెల్యే వెలగపూడిని నాలుగోసారి గెలిపించాలని, ఎంపీగా శ్రీభరత్‌ను గెలిపించాలని అభ్యర్థించారు.

మత్స్యకారులకు అండగా టీడీపీ

భీమునిపట్నం : టీడీపీ మత్స్యకారులకు ఎల్లవేళలా అండగా ఉంటుందని పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. తోటవీధిలో పార్టీ నాయకులు భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చురకల రమణ, అర్థపాకల గురునాథరావు, బొద్దు రమేష్, పిల్లా తాతారావు, కారి పరదేశి, రాంబాబు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

కూటమి తొలి సభ విజయవంతం

పెదవాల్తేరు : చిలకలూరిపేటలో జరిగిన టీడీపీ, జనసేన బీజేపీ తొలి బహిరంగ సభ విజయవంతమైందని బీజేపీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర అన్నారు. సోమవారం ఆయన నగరంలోని బీజేపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో సైకో పాలన కొద్ది రోజు ల్లో పోతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో కూటమి విజయం ఖాయమని చెప్పారు.

'సూపర్ సిక్స్' పథకాలపై అవగాహన

విశాలాక్షినగర్ : విశాలాక్షినగర్, చలపతినగర్, కైలాసగిరి రోడ్డులో వెలగపూడి సతీమణి సుజన ప్రచారం చేపట్టారు. ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేస్తూ వెలగపూడిని నాలుగోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు.

నేడు, రేపు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

మద్దిలపాలెం, మార్చి18 : విశాలాక్షినగర్‌లోని బీవీకే హైస్కూల్లో మంగళ, బుధవారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు గోఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం అధ్యక్షుడు దాట్ల సుబ్రహ్మణ్యవర్మ చెప్పారు. సోమవారం ఆయన శివాజీపాలెంలోని కార్యాలయంలో విలేకరులతో మాట్లా డారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ నాడీ వ్యవస్థ వైద్యులు గురుజీ జైశ్రీరామ్ శిబిరంలో పాల్గొని వైద్య సేవలందిస్తారని చెప్పారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు రోజుకు 125 నుంచి 150 మందికి మాత్రమే చికిత్స అందిస్తారని తెలిపారు. ఆసక్తి గల వారు 98661 38129 నంబర్‌కు కాల్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

నేటి నుంచి వెంకన్న వార్షిక బ్రహ్మోత్సవాలు

భీమునిపట్నం, మార్చి 18 : పట్టణంలోని కృష్ణా కాలనీ వేంకట గిరిపై ఉన్న పద్మావతి, గోదా సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం నుంచి 25వ తేదీ వరకూ ద్వాదశ వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ సంక్షేమ సంఘం సభ్యులు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి ఆలయంలో అష్టోత్తర శత కలశాలతో స్వామివారికి మహా కుంభాభిషేకం నిర్వహిస్తామన్నారు. 20న గరుడ పంచశయ్యాధివాసం, ధ్వజారోహణం, సాయంత్రం శ్రీవారి కల్యాణం జరుగుతుందన్నారు. 21న సామూహిక శ్రీలక్ష్మీ నారాయణ వ్రతము, సాయంత్రం శ్రీ స్వామివారు, అమ్మవార్ల నగర పర్యటన, 22న సుదర్శన హోమం, సాయంత్రం దీపోత్సవం నిర్వహిస్తామని చెప్పారు. 23న అష్టలక్ష్మి సామూహిక కుంకుమార్చనలు, సాయంత్రం శ్రీకృష్ణ కూచిపూడి నృత్య నిలయం వారితో ప్రదర్శన, 24న సహస్ర దీపాలంకరణ, 25న కొన్నాలోత్సవం, చక్ర తీర్థోత్సవం, సాయంత్రం శ్రీ పుష్పయాగం, ఏకాంత సేవతో ఉత్సవాలు ముగిస్తాయని తెలిపారు. ఈమేరకు కమిటీ సభ్యులు ఒక ప్రకటన విడుదల చేశారు.

పైడిమాంబ అమ్మవారి ఉత్సవాలు ప్రారంభం



ఆరిలోవ, మార్చి 18 : ఆదర్శనగర్ జంక్షన్‌లో జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న పైడిమాంబ అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈనెల 26న జరిగే ప్రధాన పండుగ తో ఉత్సవాలు ముగియనున్నట్టు ఆలయ ధర్మకర్తలు మీసాల రామలక్ష్మణులు తెలిపారు. ఈమేరకు వారు విలేకరులతో మాట్లాడారు. సుమారు 150 ఏళ్లుగా అమ్మవారు ఈ ప్రాంతంలో ఉన్నారని, 25న వేకువజామున కుంకుమ పూజలు, ప్రత్యేక అభిషేకాలు జరుగుతాయన్నారు. ఉత్సవం ముగింపు రోజున భారీ ఎత్తున బాణసంచా పేల్చివేత, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.

పక్కాగా ఎన్నికల కోడ్ అమలు : ఎంపీడీఓ

పద్మనాభం (రూరల్), మార్చి 18 : ఎన్నికల కోడ్‌ను గ్రామాల్లో పక్కాగా అమలు చేయాలని ఎంపీడీఓ బి. శైలజ ఆదేశించారు. సోమవారం ఆమె తన కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోడ్‌పై ఉద్యోగులు ముందుగా అవగాహన చేసుకోవాలన్నారు. ప్రభుత్వ స్థలాల్లో రాజకీయ నాయకులకు చెందిన ఫ్లెక్సీలు,హోర్డింగ్‌లను తొలగించాలని చెప్పారు. అలాగే రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయాలన్నారు. కోడ్ అమ లులో ఎలాంటి వివక్ష చూపరాదన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న వీసీ ప్రసాదరెడ్డి

వ్యర్థాల నిర్వహణ పట్ల శ్రద్ధ అవసరం : వీసీ

వెంకోజీపాలెం, మార్చి 18 : వ్యర్థాల నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి అన్నారు. గ్లోబల్ సైక్లింగ్ డే పురస్కరించుకుని సోమవారం ఏయూ విద్యా విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణలో వ్యర్థాల నిర్వహణ ముఖ్య భూమిక పోషిస్తుందన్నారు. విభిన్న రూపాల్లో నిత్యం మనం చూస్తున్న వ్యర్థాలకు ఒక ప్రత్యేక విధానంలో రీసైక్లింగ్ చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. ప్రజల్లో దీనిపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.ఏయూలో ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ, నిర్వహణకు ప్రత్యేక విధానాన్ని అవలంబించడం జరుగుతుందన్నారు. వర్సిటీలో ఏర్పడే ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ప్రత్యేక విధానంలో సేకరించి, నగరానికి చెందిన ఎంఎస్ఎంఈ ఎలక్ట్రో ప్రోసెస్ సహకారంతో శాస్త్రీయ విధానంలో వాటిని రీసైకిల్ చేస్తున్నామని తెలిపారు. అనంతరం విద్యార్థులు స్వయంగా తీర్చిదిద్దిన ఫ్లకార్డు లను చూసి అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం. జేమ్స్ స్టీఫెన్, విద్యా విభాగాధిపతి ఆచార్య టి. షారోన్ రాజు, ఆచార్య డి. నాగరాజ కుమారి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లుల బాదుడు

సాగర్‌నగర్, మార్చి 18 : విద్యుత్ బిల్లులతో ఇప్పటికే షాక్ ఇస్తున్న ఏపీ ఈపీడీసీఎల్ తాజాగా అడిషనల్ లోడ్ నోటీసులతో వినియోగదారులను బెంబేలెత్తిస్తోంది. తీర ప్రాంతాలైన సాగర్‌నగర్, రుషికొండ వాసులపై వీరబాదుడు బాదుతోంది. పెంచిన యూనిట్ చార్జీలతో స్లాబ్ ఏమాత్రం మారినా వేలల్లో వస్తున్న బిల్లులతో వినియోగదారులు షాక్‌కు గురవుతున్నారు. పెరిగిన విద్యుత్ దరలతో ఇళ్లల్లో ఫ్యాన్లు వేసుకోవాలంటే ఒకటికి రెండుసార్లు ఆలోచించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఒకప్పుడు బిల్లు రూ 500 అంటే అమ్మో అన్నవారికి ఇప్పుడు రూ. 1500 నుంచి రూ. 3 వేలు వరకు వస్తున్నాయి. ఇది చాలదు అన్నట్టు విద్యుత్ మీటర్లలో ఎంఎఫ్ (అధిక లోడు) చూపించిందంటూ ఎటువంటి లోడ్ వెరిఫికేషన్ చేయకుండా అడిషనల్ లోడు నోటీసులు జారీ చేస్తుండడంతో బెంబేలెత్తిపోతున్నారు. సుభాష్‌నగర్ సమీపంలో మసీదు వెనుక కొండపై ఉన్న ఓ మహిళకు ఏకంగా రూ. 8 వేల అడిషనల్ లోడు కట్టాలంటూ నోటీసు అందించడంతో ఆమె ఆందోళన చెందుతోంది. పక్క రాష్ట్రాలు ఉచిత విద్యుత్ అందిస్తుండగా ఇక్కడ మాత్రం అధిక చార్జీలు వసూలు చేయడం దారుణమని పలువురు పేర్కొంటున్నారు.

న్యాయవాద వృత్తిలో లీగల్ డ్రాఫ్టింగ్ కీలకం

- హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ సోమయాజులు



మాట్లాడుతున్న హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ సోమయాజులు

సాగర్‌నగర్, మార్చి 18 : న్యాయవాద వృత్తిలో రాణించాలనుకునే యువత లీగల్ డ్రాఫ్టింగ్‌పై పట్టుసాధించాలని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సోమయాజులు సూచించారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ లా ఆధ్వర్యంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతిభావంతమైన కేసు రచన సరళమైన భాషతో చెప్పదలచుకున్న విషయాలు తగిన ఆధారాలతో ఉండాలన్నారు. లీగల్ డ్రాఫ్టింగ్‌లోని బలమైన అంశాలకు న్యాయస్థానాల్లో ఎంతటి ప్రాధాన్యత ఉంటుందో ఉదాహరణలతో వివరించారు. అలాగే వివిధ రకాల లీగల్ డ్రాఫ్టింగ్ పద్ధతులను తెలియజేసి విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ అనితారావు, తదితరులు పాల్గొన్నారు.

టైపు ప్రశ్న పత్రాల వాల్యుయేషన్ ప్రారంభం

తగరపువలస, మార్చి 18 : సాంకేతిక విద్యా శాఖ ఆధ్వర్యంలో టైపు నేర్చుకుంటున్న విద్యార్థుల పరీక్షలకు సంబంధించిన స్పాట్ వ్యాల్యుయేషన్ సోమవారం నుంచి స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో ప్రారంభమైంది. చిట్టివలసకు చెందిన లక్ష్మీ, రాజా, సూర్య టైపు నిర్వాహణ సంస్థలకు చెందిన వారిని ఈ పరీక్షల స్పాట్‌కు నియమించారు. ఈ పరీక్షలు ఈనెల 2, 3 తేదీల్లో తెలుగు, ఇంగ్లీషు మీడియంలో లోయర్, ,హయ్యర్ విభాగాలకు సంబంధించి నిర్వహించిన సంగతి తెలిసిందే.

యువకుడ్ని కాపాడిన లైఫ్‌గార్డులు



యువకుడితో మెరైన్ పోలీసులు, లైఫ్‌గార్డులు

సాగర్‌నగర్, మార్చి 18 : రుషికొండ బీచ్‌లో సముద్ర స్నానం చేస్తూ ప్రమాదానికి గురైన యువకుడ్ని లైఫ్‌గార్డులు, మెరైన్ పోలీసులు సోమవారం రక్షించారు.పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన ఓ కుటుంబం విహార యాత్ర కోసం సోమవారం రుషికొండ తీరానికి వచ్చారు. వారిలో గంటా మనోహర్ (17) సముద్ర స్నానం చేస్తుండగా పెద్ద కెరటం తాకడంతో ప్రమాదంలో చిక్కుకున్నాడు. దీంతో కుటుంబీకులు పెద్దగా కేకలు వేయడంతో సమీపంలో విధులు నిర్వర్తిస్తున్న మెరైన్ పోలీసులు, లైఫ్‌గార్డులు స్పందించి కెరటాల్లో కొట్టుకుపోతున్న మనోహర్‌ను రక్షించి సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు.

రోడ్డుపై నిర్మాణ సామగ్రితో ఇబ్బందులు



రోడ్డు మధ్యలో వేసిన నిర్మాణ సామగ్రి

ఆరిలోవ, మార్చి 18 : జీవీఎంసీ 12వ వార్డు శాలిపేటలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల్లో భాగంగా రోడ్లను తవ్విన గోతుల పూడ్చివేతకు తీసుకువచ్చిన నిర్మాణ సామగ్రిని రోడ్డు మధ్యలో వేయడంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం ఈ మార్గంలో వందలాది వాహనాలు, పాదచారులు రాకపోకలు సాగిస్తుంటారు. సంబంధిత కాంట్రాక్టరు నిర్మాణ సామగ్రిని రోడ్డుపై వేయడంతో వారంతా రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి నిర్మాణ సామగ్రిని డివైడర్లకు ఆనుకుని వేసేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

గిడిజాలలో ఎన్ఎస్ఎస్ శిబిరం

ఆనందపురం, మార్చి 18 : మండలంలోని మిందివానిపాలెం సమీపంలో ఉన్న వీతం ఫార్మసీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం గిడిజాల గ్రామంలో శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని కళాశాల ప్రిన్సిపాల్ ఉమాదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వారం రోజుల పాటు జరిగే ఈ శిబిరంలో విద్యార్థులు గ్రామంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్టు తెలిపారు. ముందుగా విద్యార్థులు ప్రభుత్వ కార్యాలయాలు, పబ్లిక్ ప్రదేశాల్లో క్లీన్ అండ్ గ్రీన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ షిణగం అప్పలరాజు, ఎన్ఎస్ఎస్ పీవో సమన్వయి, తదితరులు పాల్గొన్నారు.

మద్దిలో పార్వతీ పరమేశ్వరుల విగ్రహాల ప్రతిష్ఠ


పద్మనాభం, మార్చి 18 : మండలంలోని మద్ది గ్రామంలో పార్వతీ పరమేశ్వరుల విగ్రహాల పునఃప్రతిష్ఠ సోమవారం ఘనంగా జరిగింది. గ్రామంలోని రామాలయంలో ఉపాలయంగా ఉన్న పార్వతీ పరమేశ్వరుల విగ్రహాలు జీర్ణావస్థకు చేరుకోవడంతో నూతన విగ్రహాలను నిర్మించి పునఃప్రతిష్ఠ చేశారు. ఈ సందర్భంగా ఆలయ పురోహితులు సామవేదం సీతారామయ్య స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో కనకల అప్పలరాజు దంపతులు, కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

పద్మనాభం, మార్చి 18 : మండలంలోని బుడ్డివలస గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో వారం రోజులుగా గ్రామస్థులు సరఫరా లేక ఇబ్బంది పడుతున్నారు. గృహ విద్యుత్ కోసం వేసిన ట్రాన్స్‌ఫార్మరు కాలిపోవడంతో ఈ సమస్య తలెత్తింది. దీనిపై స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సమీపంలో ఉన్న వ్యవసాయ మోటార్ల కోసం వేసిన ట్రాన్స్‌ఫార్మరుకు తాత్కాలికంగా కనెక్షన్ కలిపి సరఫరా ఇస్తున్నా.. తరచూ లైన్ ట్రిప్పయి, సరఫరాకు ఆటంకం కలుగుతోంది. గృహ విద్యుత్ కనెక్షన్‌లకు వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మరు నుంచి సరఫరా ఇవ్వడంతో ఇటు వ్యవసాయానికి సక్రమంగా సరఫరా లేక, అటు గృహ విద్యుత్‌కు చాలక ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ వేయడానికి ట్రాన్స్‌కో అధికారులు మీనమేషాలు లెక్కించడంతో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు

కనక మహాలక్ష్మి కోఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ రాంబాబు



ఖాతాదారుడ్ని సన్మానిస్తున్న బ్యాంకు అధికారులు

వెంకోజీపాలెం, మార్చి 18 : అన్ని రంగాల వారి అభివృద్ధి, ఉత్తమ సేవలే ధ్యేయంగా తమ బ్యాంకు పనిచేస్తోందని కనక మహాలక్ష్మి కోఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు అన్నారు. బ్యాంకు రజతోత్సవాల సందర్భంగా సోమవారం కంచరపాలెం, సీతమ్మధార బ్యాంకు శాఖల ఆవరణలో నిర్వహించిన ఖాతాదారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖాతాదారులకు తమ బ్యాంకు ద్వారా వినూత్న సేవలందిస్తూ వారి ఆదరణ పొందుతున్నామన్నారు. బ్యాంకు వైస్ చైర్మన్ జి. రామకృష్ణ మాట్లాడుతూ సీతమ్మధారలో తమ బ్యాంకు ఏర్పాటైన నాటి నుంచి ఖాతాదారుల, శ్రేయోభిలాషుల సహకారంతో ముందుకు సాగుతుందన్నారు. అనంతరం ఖాతాదారులు పలు సూచనలు చేయడంతో పాటు తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ఖాతాదారులను చైర్మన్ సత్కరించారు. ఈ సమావేశంలో బ్యాంకు డైరెక్టర్ బి. నాగేశ్వరరావు, సీఈఓ కె. శ్యామ్ కిషోర్, ఓఎస్‌డీ శాస్త్రి, ఆయా బ్రాంచిల మేనేజర్లు కె. విశ్వనాథం, దిలీప్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బోని యల్లమ్మ జాతర

పద్మనాభం (రూరల్), మార్చి 18 : బోని గ్రామస్తుల ఆరాధ్య దైవం యల్లమ్మ తల్లి జాతర సోమవారం ఘనంగా జరిగింది. తెల్లవారుజాము నుంచి స్థానికులతో పాటు పరిసర గ్రామాల భక్తులు ఆలయానికి తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.